

బియ్యం చెరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మధ్యాహ్న భోజనంలో తెల్లపురుగులు

విద్యార్థులు చెప్పటంతో అప్రమత్తమైన హెచ్‌ఎం

చల్లపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలం పురిటిగడ్డ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో మధ్యాహ్న భోజనంలో తెల్లపురుగులు కనిపించాయి. విద్యార్థుల ద్వారా విషయం తెలుసుకున్న హెచ్‌ఎం శర్మ అప్రమత్తమయ్యారు. విద్యార్థులు ఆ భోజనం చేయకుండా ఆ ఆహారాన్ని పారవేయించి, మళ్లీ వంట చేయించి భోజనం పెట్టించారు. బుధవారం మధ్యాహ్నం ఎప్పటిలాగానే పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తుండగా, ఓ విద్యార్థి వచ్చి అన్నం గట్టిగా ఉందని హెచ్‌ఎంకు చెప్పింది. మరో ముగ్గురు విద్యార్థినులు వచ్చి అన్నంలో పురుగులు వచ్చాయంటూ తెల్లపురుగులను చూపించారు. దీంతో హెచ్‌ఎం అప్రమత్తమయ్యారు. పిల్లలను భోజనం చేయొద్దన్నారు. భోజనాన్ని, కూరను సైతం పారవేయించారు. కుకింగ్ ఏజెన్సీ కార్మికులతో బియ్యం చెరిగించి, మళ్లీ వంట చేయించి భోజనం పెట్టారు. ఈనెల 3వ తేదీన సన్నబియ్యం స్టాకు వచ్చిందని, బియ్యం బాగానే ఉన్నాయని, ఇప్పటివరకూ పిల్లల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవని హెచ్‌ఎం శర్మ తెలిపారు. బియ్యం బాగుచేశాకే అన్నం వండుతామని, అందులో బుధవారం తెల్లపురుగులు కనిపించటంతో మరోమారు బియ్యం చెరిగించి వంట చేశామన్నారు.

సమస్యలు సమసేనా?

ఓవైపు రైతులను యూరియా సమస్య వేధిస్తోంది. ఇంకోవైపు ఇసుక అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి.. ఈ నేపథ్యంలో గురువారం మచిలీపట్నంలోని జెడ్పీ కన్వెన్షన్ హాల్లో జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంపై సందిగ్ధం నెలకొంది. ప్రజాసమస్యలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం నిర్ణయాలు తీసుకోవాల్సిన ఈ సమావేశం గత రెండు విడతలుగా నామమాత్రంగానే ముగిసింది. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండానే వాయిదా వేశారు. గురువారం సమావేశానికైనా అసలు సభ్యులు హాజరవుతారా అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఈసారైనా ప్రజాసమస్యలపై చర్చ జరిగేనా?

- గత రెండు విడతల సమావేశం నామమాత్రం
- అర్థంతరంగా వాయిదా.. ఎక్కడి సమస్యలు అక్కడే
- ప్రస్తుతం జిల్లాలో యూరియా సమస్య
- గృహ నిర్మాణం, కాలనీల్లో వసతులు అంతంతే..
- ప్రజాప్రతినిధుల హాజరుపైనా సందిగ్ధం

యూరియాపై చర్చిస్తారా..

జిల్లాలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ బి.రాజశేఖర్ జిల్లాలో పర్యటించి యూరియా కొరతపై వివరాలు సేకరించారు. అధికారులు జిల్లావ్యాప్తంగా పర్యటిస్తున్నా ప్రతి మండలంలోనూ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాకు యూరియా సరిపడినంతగా వచ్చిందంటున్నా, రైతులకు అందని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కలెక్టర్ బాలాజీ గన్నవరం మండలం కొండపావులూరు గ్రామంలో రైతులతో మాట్లాడిన సమయంలో ఆధార్‌కార్డులు తీసుకెళ్లిన వారందరికీ యూరియా ఇచ్చారని, వారిలో కొంతమంది అసలు సాగు చేయడం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో తిరుగుతూ యూరియా విక్రయాలపై ఆరా తీస్తున్నారు. కాగా, యూరియా కొరత ఏర్పడటానికి గల కారణాలపై మిగతా 6లో..



మచిలీపట్నంలోని జెడ్పీ కార్యాలయం

శాసనసభ్యులు హాజరవుతారా?

జిల్లా పరిషత్ పాలన ఉమ్మడి జిల్లాస్థాయిలోనే జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన శాసనసభ్యులెవరూ హాజరుకాలేదు. జూలైలో జరిగిన సమావేశానికి కృష్ణా జిల్లాకు చెందిన శాసనసభ్యులు కూడా హాజరుకాలేదు. జెడ్పీటీసీ సభ్యులు, శాసనసభ్యులు, ఎంపీలకు సమావేశానికి హాజరుకావాలని సమాచారం అందించామని జెడ్పీటీసీ అధికారులు చెబుతున్నారు. గురువారం జరిగే సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, శాశ్వత ఆహ్వానితులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎంతమేర హాజరవుతారో చూడాలి.

మొవ్వపాలెం సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు



యూరియా లోపాలు

జిల్లాలో ఇంకా కొనసాగుతున్న కొరత

సరఫరాలో సరికాని లోపాలు

- తీరప్రాంత మండలాల్లో వరినాట్లు
- యూరియా అందక రైతుల అవస్థలు
- ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నా ప్రతిష్టంభన

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : జిల్లాలో యూరియా నిల్వలు తగినంతగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నా రైతులకు పూర్తిస్థాయిలో అందట్లేదు. అవసరమైన ప్రాంతాల్లో యూరియా సరఫరా చేయకుండా అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ శాఖ కమిషనర్, కలెక్టర్, మిగతా 6లో..

జిల్లాకు 4,400 మెట్రిక్ టన్నుల యూరియా

రెండు రోజుల్లో రానుంది : కలెక్టర్ బాలాజీ

జిల్లాకు రెండు రోజుల్లో 4,400 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, రైతులెవరూ ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, అందరికీ యూరియా సరఫరా చేస్తామని కలెక్టర్ బాలాజీ తెలిపారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో ఉన్న తన చాంబర్‌లో బుధవారం సాయంత్రం ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 1 నుంచి ఇప్పటివరకు 4,380 టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందన్నారు. ఆ యూరియాను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. గురువారం మరో 2,600 మెట్రిక్ టన్నులు, శుక్రవారం మరో 1,800 టన్నుల యూరియా జిల్లాకు రానుందన్నారు. ఆ తర్వాత కూడా నిరంతరం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు యూరియా కేటాయింపులు చేస్తుందన్నారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని, యంత్రాంగానికి అన్నివిధాలా సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, వ్యవసాయ శాఖ డీడీ మనోహర్‌రావు, ఏడీ మునిధర్, ఏవో శాంత తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద ఫ్లెక్సీలకు ప్రింటర్లదే బాధ్యత

- ఎస్పీ గంగాధరరావు 6

తరలనున్నరా లేదా?

దసరాకు వెళ్తామన్న కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ అసోసియేషన్

- ఇప్పటి వరకు స్పందించింది లేదు
- సకల సౌకర్యాలతో నున్న మార్కెట్ పూర్తి
- అయినా వెళ్లకుండా మీనమేషాలు
- దసరా నాటికి ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు
- ఇప్పటికైనా కదిలించాలని స్థానికుల వేడుకోలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను నున్నకు తరలించడం ప్రహసనంగా మారింది. భారీ వాహనాల కారణంగా ఇక్కడ రోజూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈనెల 22 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 'విజయవాడ ఉత్సవ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేదారేశ్వరపేటలో పరిస్థితి ఇలాగే ఉంటే, ట్రాఫిక్ సంక్షోభం నెలకొనే పరిస్థితి ఉంది.

లారీలు, కంటైనర్లతో హడావిడి

రోజూ ఉదయాన్నే కేదారేశ్వరపేట మార్కెట్ వద్ద లారీలు, కంటైనర్లు సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్లపైనే వాహనాలను దిగుమతులు చేస్తుండటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. ఉదయం పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, వివిధ పనులపై బయటకు వచ్చే వారికి నరకం కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదు. అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవట్లేదు.



కేదారేశ్వరపేట మార్కెట్‌లో ఇరుకుగా ఎగుమతులు, దిగుమతులు

అందుబాటులోనే నున్న మార్కెట్

బైపాస్ రోడ్డు వెంబడే నున్న పండ్ల మార్కెట్ పూర్తై ఉంది. 22 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. వంద అడుగుల రోడ్లు, డ్రెయినేజీలు, మరుగుదొడ్లు.. ఇలా అన్ని సదుపాయాలు ఉన్నాయి. దసరా నాటికి వెళ్లిపోతామని కేదారేశ్వరపేట మార్కెట్ అసోసియేషన్ చెప్పినా ఇంతవరకు కదల్లేదు. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లో అసౌకర్యాల నడుమ అనేక ఇబ్బందులకోర్చి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారంతా నున్న వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నా.. అసోసియేషన్ నాయకులు మాత్రం కదలనివ్వట్లేదు. షాపులను తమ నియంత్రణలో ఉంచుకుని ఎదురుతిరిగిన వారిని సాగనంపే కార్యక్రమాలు చేస్తుండటంతో తమ వ్యాపారాలు ఎక్కడ దెబ్బతింటాయోనని ఆందోళనతో వ్యాపారులు తప్పక కదలని పరిస్థితి ఏర్పడింది. విజయవాడ ఎంపీతో పాటు ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్, జిల్లా యంత్రాంగాలన్నీ కలిసి రంగంలోకి దిగకపోతే తప్ప మార్కెట్ ఇక్కడి నుంచి కదిలే పరిస్థితి లేదు.



ఆన్‌లైన్ మోసాలకు చెక్

- అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌కు అనూహ్య స్పందన
- ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సెమీఫైనల్స్ పోటీలు 6
- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది విద్యార్థుల హాజరు
- పది థీమ్స్‌పై సమస్యల పరిష్కారానికి పోటీపడిన విద్యార్థులు

గుడ్ జాబ్

- ఒకే గ్రామం నుంచి 15 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు 6
- ఆదర్శంగా నిలిచిన జరుగువానిపాలెం

ఒక ఊరిలో ఒకరిద్దరికి ఉద్యోగాలు రావడం సహజం. కానీ, ఆ ఊర్లో ఏకంగా 15 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. ఇందులో ఎనిమిది మంది అమ్మాయిలు, ఏడుగురు అబ్బాయిలు ఉన్నారు. ఒకేసారి 11 మందికి టీచర్, మూడు పోలీసు, ఒకరికి సేల్స్ ట్యాక్స్‌లో ఉద్యోగాలు రావటం విశేషం. కోడూరు మండలం జరుగువానిపాలెం గ్రామానికి చెందిన వీరికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఇనుము చిత్రాలు కనుము

తోట్లవల్లూరు జగనన్న కాలనీల ఇనుము, సిమెంట్ నాశనం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల కోసం నాటి వైసీపీ ప్రభుత్వం సరఫరా చేసిన ఇనుము, సిమెంట్ పనికిరాకుండా పోతున్నాయి. పేదల ఇంటి నిర్మాణాలకు ఉపయోగపడాల్సిన 121 టన్నుల ఇనుము ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టిపోతోంది. అలాగే, 2 వేల సిమెంట్ కట్టలు గోడౌన్‌లో నెలల తరబడి నిల్వ ఉండి గడ్డలు కట్టేస్తున్నాయి.

- 121 టన్నుల ఇనుముకు తుప్పు.. విలువ రూ.60 లక్షలు
- రూ.6 లక్షల విలువ చేసే సిమెంట్ బస్తాలు పనికిరాకుండా..
- నాలుగేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న ఇళ్ల నిర్మాణం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జగనన్న ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు గత వైసీపీ ప్రభుత్వం తోట్లవల్లూరు మండలానికి భారీగా ఇనుము, సిమెంట్ సరఫరా చేసింది. తోట్లవల్లూరు హౌసింగ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద 121 టన్నుల ఇనప చువ్వలు గుట్టలుగా వేసి ఉన్నాయి. సుమారు నాలుగేళ్ల నుంచి ఈ చువ్వలు వానకు తడుస్తూ, ఎండకు ఎండుతున్నాయి. కొన్ని చువ్వల గుట్టలపై పిచ్చికాడ పెరిగింది. 8 ఎంఎం ఇనప చువ్వల టన్ను ధర ప్రస్తుతం రూ.60 వేల వరకు ఉంది. రూ.50 వేల చొప్పున లెక్కకట్టినా విలువ రూ.60 లక్షల వరకు ఉంటుంది. అలాగే, పెనమకూరు దళితవాడ వద్ద ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మూడేళ్ల నుంచి 2 వేల సిమెంట్ కట్టలు ఉన్నాయి. ఈ కట్టలు రాళ్లుగా మారిపోయాయి. ఒక సిమెంట్ కట్ట రూ.300 చొప్పున 2 వేల కట్టల విలువ రూ.6 లక్షల వరకు ఉంటుంది.

1,809 ఇళ్లకు నిర్మించింది 729 ఇళ్లే..

తోట్లవల్లూరు మండలంలోని 16 గ్రామాల్లో 20 లేఅవుట్లు, 1,809 ప్లాట్లు వేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా ప్రభుత్వం అన్ని ప్లాట్లలో ఇళ్లు నిర్మించేందుకు ఇనుము, సిమెంట్ మెటీరియల్ ఇచ్చింది. అందుకు తగ్గట్టుగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేకపోవటంతో లక్షలాది మిగతా 6లో..



హౌసింగ్ కార్యాలయం ఉత్తరం వైపున ఇనప చువ్వలను కప్పేసిన పిచ్చిమొక్కలు

అధికారులకు తెలియజేశాం..

ఇనుము పాడైపోతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఎక్కడైనా గోదాముల్లోకి తరలించమని సూచించారు. 121 టన్నుల ఇనుము సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు ప్రణాళికలు వేస్తున్నాం. సిమెంట్ కట్టల్లో కొన్ని గడ్డలు కట్టాయి. కొత్త ఇళ్లు మంజూరైతే లబ్ధిదారులకు మెటీరియల్ అందిస్తాం. - జి.నాగబాబు, ఇన్‌చార్జి ఏఈ

తరగతి గదిలో పాము కలకలం!

- పిల్లలకు తప్పిన ప్రమాదం 6

ఎన్టీఆర్ స్ఫూర్తి సహకార రంగానికి పునాది

- జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ నెట్టెం



జరుగువానిపాలెంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఊరికే వన్నె తెచ్చారు..

» ఒకే గ్రామం నుంచి 15 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

» ఆదర్శంగా నిలిచిన జరుగువానిపాలెం

కోడూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆ ఊరిలో 15 మంది ని ప్రభుత్వఉద్యోగాలు వరించాయి. ఎనిమిది మంది అమ్మాయిలు, ఏడుగురు అబ్బాయిలు ఒకేసారి నియామకపత్రాలను అందుకోనున్నారు. కోడూరు మండలం జరువానిపాలెం గ్రామానికి చెందిన 15 మంది అభ్యర్థులు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ, పోలీసు పరీక్షలు రాశారు. పట్టుదలతో చదివి ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఒకేసారి 11 మందికి టీచర్, మూడు పోలీసు, ఒకరికి సేల్స్ ట్యాక్స్‌లో ఉద్యోగాలు రావటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఊరికి ఇంత పేరు తెచ్చిన వారి తల్లిదండ్రులను గ్రామస్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గత పదేళ్లుగా ఉద్యోగం కోసం ఎదురుచూశామని, ప్రభుత్వ నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఉద్యోగం సాధించాలని శ్రమించామని, కష్టానికి ఫలితం రావటం సంతోషంగా ఉందని ఉపాధ్యాయ, పోలీసు విజేతలు పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గ్రామస్థుల ప్రోత్సాహంతో పనిచేసి సమాజంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు, లా అండ్ ఆర్డర్ సక్రమంగా నడిపేందుకు కృషి చేస్తామన్నారు.

ఆదర్శంగా నిలిచిన పల్లెటూరు

పల్లెటూరు అనగానే వ్యవసాయం, పాడి పరిశ్రమ జీవన విధానం అనుకుంటారు. కానీ ఇక్కడి యువత వృత్తులతో పాటు విద్య, ఉద్యోగాలు సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కోడూరు మండలంలోని జరుగువానిపాలెం గ్రామం చిన్న పల్లెటూరు. పూర్తి వ్యవసాయ ఆధారిత గ్రామంలో 540 ఇళ్లు మాత్రమే ఉంటాయి. 1160 మంది జనాభా ఉన్నారు. అభివృద్ధికి నోచుకోని పల్లెలో సన్న, చిన్న కారు రైతులు సాగు చేసుకుంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా పట్టుదలతో చదివి 15మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు.



మీడియాతో మాట్లాడుతున్న కృష్ణావిశ్వవిద్యాలయం ఫార్మసి విద్యార్థులు

బి ఫార్మసీ చదివినా ఉద్యోగాలు రాలేదు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్సిటీలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలు రావడం లేదని బిఫార్మసీ విద్యార్థులు బుధవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ సర్టిఫికెట్‌కు విలువ లేకుండా పోయిందన్నారు. ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌లు వెళ్లినా ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ చదివిన బి.ఫార్మసీ కోర్సులకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులకు సరైన గుర్తింపు లేక ఉద్యోగాలు రావడం లేదన్నారు. దీనిపై విశ్వవిద్యాలయం అధికారులకు పలుసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి దృష్టికి తీసుకెళతామన్నారు.

జిల్లాలో ఏడు కేంద్రాల్లో ఆధార్ నమోదు

» విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆధార్‌కార్డులు లేక కొందరు విద్యార్థులకు తల్లికి వందనం అమలుకాని నేపథ్యంలో జిల్లాలో ఏడు కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్‌కార్డు నమోదు చేస్తున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎం.ఫణి ధూర్జటి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ప్రత్యేక ఆధార్‌కార్డు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, బాపులపాడు, గన్నవరం, ఉయ్యూరు, గుడివాడ, పెనమలూరు, ఉంగుటూరు, గుడ్లవల్లేరు కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ కింద ఆధార్‌కార్డు నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటికి 192 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారన్నారు. కిట్ క్యాంప్ మోడ్‌లో ఆధార్‌కార్డులు అందిస్తున్నామన్నారు.

తరగతి గదిలో పాము కలకలం!

» పిల్లలకు తప్పిన ప్రమాదం



తోట్లవల్లూరు, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో పాముల బెడద వీడటం లేదు. ఆగస్టు 15వ తేదీన 10వ తరగతి రూము కిటికీ పక్కనే పెద్దసంఖ్యలో కట్ల పాములను చంపారు. తాజాగా బుధవారం 8వ తరగతి గదిలో క్లాసులు జరుగుతుండగానే తాచుపాము బయటకు వచ్చింది. గోడకు నిలిపి ఉంచిన పాత చెక్క బల్లల మధ్యలో నక్కింది. అక్కడే చచ్చిన కప్పను ఓ విద్యార్థి లాగగా తాచుపాము ఒక్కసారిగా బుసలు కొడుతు బయటకువచ్చింది. దాంతో విద్యార్థులు హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులెత్తారు. ఉపాధ్యాయులు ధైర్యంచేసి పామును చంపేయటంతో ఊపిరి పీల్చుకున్నారు. తాచుపాము తరగతి గదిలో స్థావరం ఏర్పాటు చేసుకున్నట్టు చెబుతున్నారు. హైస్కూల్ ఆవరణలో పాములు ఎక్కువగా సంచరిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెన్షనర్లకు ట్యాక్స్ రిటర్న్స్ తప్పనిసరి

» జిల్లా జనరల్ సెక్రటరీ బి.విష్ణువర్ధనరావు

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐటీ పరిధిలోని పెన్షనర్లు తప్పకుండా 2024-25కు సంబంధించిన ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలని జిల్లా జనరల్ సెక్రటరీ బి.విష్ణువర్ధనరావు తెలిపారు. నగరంలోని పెన్షనర్స్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐటీ నుంచి మినహాయింపు పొందిన పెన్షనర్లందరూ నగరంలోని తూర్పు సబ్‌ట్రెజరీ వద్ద ఫార్మ్ 16ను పాన్‌కార్డు చూపించి తీసుకోవాలన్నారు. ట్యాక్స్ పడని పెన్షనర్లు కూడా రూ.7.50 లక్షల వార్షిక ఆదాయం వారికి రూ.3.50 లక్షల వరకు ట్యాక్స్‌లో మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. దీనికోసం టాక్స్ పడనివారు కూడా నిల్ రిటర్న్స్ ఫైల్ చేయాలన్నారు. పెన్షనర్లకు ఇబ్బందిలేకుండా ఆడిటర్‌ను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. ఇప్పటివరకు సుమారు 450 మందికి రిటర్న్స్ ఫైల్ చేయడం జరిగిందన్నారు. సైబర్ నేరగాళ్లు ఫేక్‌కాల్స్ చేసి పీపీఓ, ఆధార్, ఐడీ నెంబర్లు అడిగితే ఎవరూ ఇవ్వవద్దని సైబర్‌క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త నెంబర్ల నుంచి ఫోన్ వచ్చి ఓటీపీ, బ్యాంకుఖాతా, ఆధార్, పాన్ కార్డు వివరాలు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి. ఎవరు ఫోన్‌చేసినా పెన్షనర్లు వారికి సంబంధించిన సమాచారం ఇవ్వవద్దు. పొరపాటున ఇస్తే అకౌంట్లలోని డబ్బుమొత్తం ఖాళీ అవుతుందన్నారు.

ఆన్‌లైన్ మోసాలకు చెక్

» అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌కు అనూహ్య స్పందన

» ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సెమీఫైనల్స్ పోటీలు

» మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది విద్యార్థులు హాజరు

» పది థీమ్స్‌పై సమస్యల పరిష్కారానికి పోటీపడిన విద్యార్థులు



ధనేకుల ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెమీ ఫైనల్ పోటీలకు హాజరైన విద్యార్థులు

కానూరు/పెనమలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాక్‌థాన్-2025 సెమీఫైనల్ పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. గంగూరులోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం జరిగిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 30 కళాశాలలు, పలు విశ్వవిద్యాలయాల నుంచి 60 విద్యార్థుల జట్లు హాజరయ్యాయి. ఒక్కో జట్టులో ఆరుగురు చొప్పున 60 జట్లలో మొత్తం 360 మంది ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ 60 జట్లకు క్వాంటమ్ కాంప్యూటింగ్‌కు సంబంధించిన పది థీమ్స్‌ను సమస్య పరిష్కారానికి ఇచ్చారు.

ఆన్‌లైన్ మోసాలను ముందే గుర్తించేలా..

బ్యాంక్ అకౌంట్స్, క్రెడిట్ కార్డు, ఆర్థిక, ఆన్‌లైన్ మోసాలను ముందే గుర్తించి ఏవిధంగా బయటపడచ్చో చెప్పే థీమ్‌ను విద్యార్థులు ఇక్కడ ప్రదర్శించారు. ఇది క్వాంటమ్ క్యాంపిటింగ్ ద్వారానే సాధ్యమని విద్యార్థులు పేర్కొన్నారు. మోసం జరిగి డబ్బుల రికవరీకి కష్టపడటం కన్నా ముందే మోసాన్ని గుర్తించి ఏవిధంగా జాగ్రత్త పడవచ్చో విద్యార్థులు వివరించారు. అదేవిధంగా ట్రేడింగ్, షేర్లు, ఇన్వెస్ట్‌మెంట్ తదితర వాటి నుంచి తక్కువ రిస్కుతో ఎక్కువ బెనిఫిట్ ఏవిధంగా పొందాలో విద్యార్థులు చేసి చూపించారు. ఇలాంటి థీమ్స్‌తో అనేక అంశాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

ఫైనల్స్‌కు 20 టీమ్స్‌లు ఎంపిక

త్వరలో జరిగే అమరావతి క్వాంటమ్‌వాలీ హ్యాకథాన్-2025 ఫైనల్ పోటీలకు ఇక్కడ హాజరైన 60 జట్లలో ఉత్తమంగా ఎంపికైన 20 జట్లను పంపనున్నారు. ఒక్కో థీమ్ నుంచి రెండుజట్లు చొప్పున మొత్తం 20 జట్లను ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపిక చేశారు.

ఆన్‌లైన్ మోసాల నుంచి బయపడవచ్చు

\- ఆర్.సందీప్‌కుమార్, పీవీపీ సిద్ధార్థ



ఆన్‌లైన్ మోసాల నుంచి ముందే ఏవిధంగా బయటపడవచ్చునో మా టీమ్ సమస్య పరిష్కారంలో భాగంగా నిరూపించింది. దీనివల్ల మోసాలను ముందే గుర్తించవచ్చు. ఇది అందరికీ ఎంతో ఉపయోగం. ఈకార్యక్రమంలో ఎన్నో కొత్త విషయాలను తాము నేర్చుకున్నాం.

క్షేత్రస్థాయి అంశాలను తెలుసుకున్నా

\- జి.వర్షిత, విజ్ఞాన్ యూనివర్సిటీ



అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్-2025 సెమీఫైనల్స్ పోటీలకు హాజరుకావడం వల్ల క్షేత్రస్థాయిలో అనేక అంశాలను తెలుసుకోగలిగాం. తమ బృందం క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం ద్వారా పలు సమస్యలకు ఏవిధంగా పరిష్కారం చూపవచ్చో చెప్పింది.

ఉద్యోగ కల్పనకు సహాయకారి

\- పి.శ్రీహాసిని, వీఆర్ సిద్ధార్థ



రానున్న రోజుల్లో ఉద్యోగ కల్పనకు క్వాంటమ్ కంప్యూటింగ్ ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నా. క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం వల్ల అన్ని అంశాలల్లో సమయం, డబ్బును ఆదా చేయవచ్చు. దీనిపై మరింతంగా అధ్యయనం చేస్తాం. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది.

పలు ప్రాజెక్టులను అధ్యాయనం చేశాం

\- పాటిబండ్ల నవ్య, ట్రిపుల్ ఐటీ (ఒంగోలు)



సెమీ ఫైనల్స్‌లో పది అంశాలపై ఏర్పాటుచేసిన పలు సమస్యల పరిష్కారం ప్రాజెక్టులను అధ్యయనం చేశా. నిజజీవితంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉద్యోగ రూపకల్పనకు కూడా దోహదపడుతుంది.

క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఎదగాలి

\- డీకేఆర్‌కే రవిప్రసాద్, ధనేకుల డైరెక్టర్



క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులు ఎదిగినప్పుడు వారి భవిష్యత్ బంగారుబాటగా ఉంటుంది. సీఎం చంద్రబాబు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ముందుకు తీసుకువెళుతున్నారు. సెమీఫైనల్స్‌కు తమ కళాశాలను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

\- రవి కడియాల, ధనేకుల ప్రిన్సిపాల్



క్వాంటమ్ కంప్యూటింగ్ వివిధ ఆవిష్కరణలకు ప్రోత్సాహకంగా ఉంటుంది. హ్యాకథాన్-2025 కేవలం ఒక పోటీ మాత్రమే కాదు, ఒక ఉద్యమం. క్వాంటమ్ ఆలోచనపరులు, ఆవిష్కర్తలను తీర్చిదిద్దే చైతన్యవంతమైన సమాజ నిర్మాణ దిశగా అడుగులు వేస్తోంది.

యూరియా సరఫరాపై ఆందోళన వద్దు

» కలెక్టర్ బాలాజీ



చల్లపల్లి మండలం లక్ష్మీపురం సొసైటీ రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు కావల్సినంత యూరియా వస్తుంది.. రైతులందరికీ సరఫరా చేస్తాం.. ఈ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలి.. అని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ చల్లపల్లి మండలంలోని లక్ష్మీపురం సొసైటీని ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖీ మాట్లాడి యూరియా స్థితిగతులపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. దాలిపర్రు గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ, ఎకరాకు గతంలో మూడు కట్టల యూరియా సరిపోయేదని, బెంగాల్ సేద్యం వల్ల నాలుగు నుంచి ఐదు కట్టల యూరియా అవసరం వస్తుందన్నారు. దాలిపర్రుకు చెందిన రైతు ప్రముఖుడు వీరమాచనేని భవానీప్రసాద్ కలెక్టర్‌ను కలిసి లంకపల్లి, మల్లంపల్లి సొసైటీల పరిధిలో లంకపల్లికి 50 టన్నులు, మల్లంపల్లికి 30 టన్నులు సరఫరా చేస్తేనే రైతులు అవసరాలు తీరతాయనీ, ఆయా గ్రామాల పరిధిలో ప్రవేటు దుకాణాలు సైతం లేకపోవటంతో రైతులకు సొసైటీల ద్వారానే యూరియా సరఫరా చేయాల్సి ఉందని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందనీ, రైతులకు కావలసినంత పంపిణీ చేస్తామన్నారు.

ప్రకృతి సేద్యం వైపు దృష్టిసారించాలి

ప్రకృతి సేద్యం వైపు రైతులు దృష్టిసారించాలని కలెక్టర్ బాలాజీ రైతులకు సూచించారు. రైతులు యూరియాపై ఎక్కువగా ఆధారపడరాదనీ, ఎక్కువ యూరియా వాడటం ద్వారా పంటచేలు దెబ్బతింటుందన్నారు. జిల్లాలో అనేకమంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదాయం పొందుతున్నారని తెలిపారు. అనంతరం సొసైటీలో యూరియా సరఫరా పంపిణీ రికార్డులు పరిశీలించి ఏవో, సొసైటీ కార్యదర్శితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చల్లపల్లి మండలానికి 290 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందనీ, తాజాగా 60 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని మిగిలిన యూరియా సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్‌ను చల్లపల్లి ఏవో కోరారు. కలెక్టర్ వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీకిషోర్, ఏడీఏ ఎస్.శ్యామల, ఏవో కె.మురళీకృష్ణ, ఎస్ఐ పీవీ సుబ్రహ్మణ్యం, సొసైటీ కార్యదర్శి రమేష్, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీ ప్రింటర్స్‌తో మాట్లాడుతున్న ఎస్పీ

వివాదాస్పద ఫ్లెక్సీలకు ప్రింటర్లదే బాధ్యత

» ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఇబ్బంది కలిగించేలా ఫ్లెక్సీలను ప్రింట్ చేయరాదని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సెంటర్ల నిర్వాహకులను హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ అధికారుల ముఖ్యమైన మార్గదర్శకాలు, చట్టపరమైన బాధ్యతలను వివరించారు. పోలీసు వారి ఆదేశాలను మీరితే ఎలాంటి చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సివస్తుందో తెలిపారు. రాష్ట్రంలో కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలతో కూడిన ఇబ్బందికర ఫ్లెక్సీల ఏర్పాటుతో తలెత్తిన పరిణామాలను గమనించామన్నారు. ఏ మతాన్నిగానీ, కులాన్నిగానీ, ప్రాంతాన్ని, ఒక వర్గాన్ని వ్యక్తులను కించపరిచేలా ఫ్లెక్సీలను ఎవరైనా తయారు చేయమని అడిగితే నిరాకరించాలని కోరారు. ఫ్లెక్సీలు ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ప్రింటింగ్ సంస్థ లోగో తప్పనిసరిగా ఉండాలన్నారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఫ్లెక్సీల ప్రింటింగ్‌లో గానీ అందులో ముద్రించే పదాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుని పోలీసు వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆడిషనల్ ఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు, కృష్ణా జిల్లా ఫ్లెక్సీ అసోసియేషన్ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తి సహకార రంగానికి పునాది

» జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ నెట్టెం



సమావేశంలో మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

గుడివాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి అన్నదాత అని పేర్కొన్న అన్న ఎన్టీఆర్ స్ఫూర్తి సహకార రంగానికి పునాది అని, ఆయన కలలను నెరవేర్చడమే టీడీపీ ప్రధాన ధ్యేయమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. బుధవారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) శిక్షణ ఆఖరిరోజు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణాజిల్లా అంటే గుడివాడ అని, వ్యవసాయానికి పెట్టింది పేరన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి రైతు సంక్షేమానికి మార్గదర్శకమైందన్నారు. సొసైటీలు, సహకార బ్యాంకుల అభివృద్ధికి ఆయన రూపకల్పన చేసిన విధానాలు భవిష్యత్తులో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది అవుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిజాయితీ, పోరాట పటిమ, రైతు, యువత, కార్మికులకు కొత్త ఉత్సాహాన్నిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా సహకార రంగాన్ని పునర్జీవింపజేస్తున్న కేంద్ర మంత్రి అమిత్‌షా కృషి సొసైటీలకు దిక్సూచిగా అవుతుందన్నారు. సొసైటీల అధ్యక్షులు రైతుల సమస్యలకు ప్రత్యక్ష పరిష్కారాలు చూపడం, రుణాలు, ఎరువులు, విత్తన సరఫరా, పంటల మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడం, డిజిటల్ రికార్డింగ్, ఆధునిక సేవల వినియోగం ద్వారా వ్యవస్థను సమర్థవంతంగా మార్చడం, సిబ్బందికి నాయకత్వం, ప్రేరణ అందించడం వంటి బాధ్యతలను నెరవేర్చాలన్నారు. సొసైటీల వ్యవస్థ బలపడితే రైతు బలపడతాడని, రైతు నిలబడితే రాష్ట్రం బలపడుతుందన్నారు. అనంతరం గుడివాడ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించి డిపాజిట్లు పెంచడంపై దృష్టి సారించాలని కోరారు. సీఈవో శ్యామ్ మనోహర్, జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, శిక్షకులు రమణారావు, కోటేశ్వరరావు, గుడివాడ, కైకలూరు, పామర్రు, గన్నవరం నియోజకవర్గాలకు చెందిన 90 పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అధునాతన వైద్యం.. అత్యున్నత ప్రమాణాలే లక్ష్యం

» శ్రీ వెంకటేశ్వర వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్య



శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్యను సన్మానిస్తున్న హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి తదితరులు

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వైద్యవిద్యలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యగా వైద్యులు కృషిచేయాలని శ్రీ వెంకటేశ్వర వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్య అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో 'అధునాతన టెక్నాలజీ-వైద్యవిద్య-జాతీయవిద్యావిధానం-2020'పై ఆన్‌లైన్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఇతర కాలేజీల నిర్వహణమండలి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ, కృత్రిమ మేధ, ఏఐటూల్స్ వంటివి ఉపయోగించుకుని సులభంగా వైద్యసేవలు అందించే సృజనాత్మక టెక్నాలజీ నేడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మెడికల్ కాలేజీల్లో ల్యాబులు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర మౌలిక వసతులు పెంచడంతో రోగులకు సాంత్వన ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సిద్ధయ్య పేర్కొన్నారు. అధిక సంఖ్యలో శస్త్రచికిత్సలు, ప్రజలకు వైద్యసేవలు చేరువగా తీసుకురావడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. జాతీయ వైద్య కమిషన్(ఎఎంసీ) కూడా ఆ దిశగా కృషిచేస్తోందన్నారు. రోగులతో వైద్యుడు వ్యవహరించాల్సిన తీరుతోపాటు నైతికతను ఒక అంశంగా వైద్యవిద్యలో చేర్చారని, వైద్యవిద్య పూర్తిచేసుకుని బయటకు వచ్చే విద్యార్థి మంచి వైద్యుడిగా సేవలందించడానికి ఇది ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. వైస్ చాన్సలర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం కేవలం థియరీ పరీక్షలతోఎంబీబీఎస్ పూర్తిచేయడమే కాకుండా ప్రాక్టీస్‌లోని అనేక అంశాల్లో విద్యార్థులు సామర్థ్యం పెంచుకోవడం చాలా కీలకమన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ ప్రీక్లినికల్ ట్రైనింగ్‌ను క్లినికల్ ట్రైనింగ్‌లో భాగం చేశారని తెలిపారు. మెడికల్ కాలేజీల్లో స్కిల్‌ల్యాబ్‌లను తప్పనిసరి చేశారన్నారు. రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ, యూనివర్సిటీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా మెడికల్ కాలేజీల యాజమాన్యాలు నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్(అకడమిక్) కె.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సమసేనా?

(5వ పేజీ తరువాయి)

గురువారం జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో నిలదీస్తామని జెడ్పీటీసీ సభ్యులు చెబుతున్నారు.

గృహ నిర్మాణం, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై చర్చ జరిగేనా..?

ఉమ్మడి జిల్లాలో 1,400కు పైగా గృహ నిర్మాణానికి సంబంధించిన లేఅవుట్లు ఉన్నాయి. వాటిలో కనీస వసతులు లేవు. ఈ లే అవుట్లలో రహదారుల నిర్మాణం, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. గత వేసవిలో కాలనీల్లో రహదారుల పనులు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొంతకాలంగా గృహ నిర్మాణంలో అంతగా పురోగతి లేదనే చెప్పాలి. ప్రతి 15 రోజులకు కలెక్టర్ బాలాజీ గృహ నిర్మాణ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నా పురోగతి మాత్రం కనిపించట్లేదు. ఈ సమావేశంలో జిల్లాలోని పాఠశాలలు, వీహెచ్‌సీ భవనాల నిర్మాణంపై చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేస్తున్న పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడం, వివిధ విభాగాల్లో పరిపాలనాపరంగా నెలకొన్న సమస్యలను ఎత్తిచూపుతామని సభ్యులు పేర్కొంటున్నారు.

ఇసుక అక్రమ రవాణా సంగతేంటి?

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. తోట్లవల్లూరు, ఘంటసాల మండలాల పరిధిలో ఇసుక రవాణా మాఫియా చేతుల్లోనే ఉంది. వర్షాకాలంలో స్టాక్ పాయింట్ల పేరుతో వందలాది లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రొయ్యూరు, చోడవరం, నార్త్ వల్లూరు, శ్రీకాకుళం, మద్దూరు తదితర ప్రాంతాల నుంచి ఇసుకను తరలించేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు ఆ వైపు చూడట్లేదు.

యూరియా లోపాలు

(5వ పేజీ తరువాయి)

జిల్లాయంత్రాంగం యూరియా ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ పేరుతో జిల్లావ్యాప్తంగా పర్యటిస్తున్నా యూరియా కొరత మాత్రం తీరట్లేదు. మొవ్వ మండలంలోని మొవ్వపాలెంలో బుధవారం యూరియా కోసం రైతులు బారులుతీరారు. సరఫరాలో తలెత్తుతున్న లోపాలను సరిచేయకుండా అధికారులు మమ.. అనిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ డీకే బాలాజీ పీఏసీఎస్‌లకువెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో గాడినపడిన పరిస్థితి లేదు.

బందరు మండలంలో కొరత

బందరు మండలంలోని నెలకుర్రు పీఏసీఎస్ పరిధిలో 13 గ్రామాలున్నాయి. పది రోజులుగా నెలకుర్రు, తుమ్మలచెరువు, కోన, వాడపాలెం, వెంకటదుర్గాంబపురం, కెపిటి పాలెం తదితర గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల వ్యవధిలో కలుపు నివారణ మందుతో పాటు ఎకరాకు కట్ట యూరియాను చల్లాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. నెలకుర్రు సొసైటీకి వారం క్రితం 455 బస్తాల యూరియాను ఇచ్చి సరిపెట్టేశారు. కలుపుమందును సకాలంలో కొడితే ఎకరాకు వెయ్యి రూపాయలు సరిపోతుందని, కలుపు మందు చల్లకుంటే ఎకరాకు రూ.15 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో యూరియా సరఫరా చేయకపోవటంతో ఇబ్బందుల పాలవుతున్నామని, వరినాట్లు వేయాలా, వద్దా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నామంటున్నారు. జిల్లాకు యూరియా వస్తుందని అధికారులు చెబుతున్నా, పంపిణీలో ఎక్కడో లోపం ఉందని ఆరోపిస్తున్నారు.

ఇనుము చిత్రాలు కనుము

(5వ పేజీ తరువాయి)

రూపాయల విలువచేసే ఇనుము, సిమెంట్ పాడైపోతున్నాయి. కేవలం 729 మందే ఇళ్లు నిర్మించుకున్నారు. మిగతా మెటీరియల్ ప్రభుత్వ కార్యాలయాల వద్ద పాడవుతోంది.

ఏఈని నియమించాలి

తోట్లవల్లూరు మండల హౌసింగ్ కార్యాలయం అనాథగా మారింది. ఇక్కడ పనిచేసిన హౌసింగ్ ఏఈ భవానీప్రసాద్ పదవీ విరమణ చెందారు. పాములలంక గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి.నాగబాబుని మండల హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా నియమించారు. ప్రస్తుతం నాగబాబు పమిడిముక్కల మండలం చోరగుడి గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. వేరే మండలానికి బదిలీ అయినప్పటికీ ఇన్‌చార్జి ఏఈగా నాగబాబునే కొనసాగిస్తున్నారు. అటు చోరగుడి సచివాలయానికి వెళ్తూ తోట్లవల్లూరు హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహించడం ఆయనకు ఇబ్బందిగా మారింది. సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు మండల ఏఈ హోదా ఎలా కల్పిస్తారనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. తోట్లవల్లూరు హౌసింగ్ కార్యాలయంలో ఒక మహిళా వర్క్ ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఉన్నారు. కొత్త ఇళ్ల మంజూరు లేకపోవటంతో ప్రస్తుతం కార్యాలయం బోసిపోతూ కనిపిస్తోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

రైతులకు సరిపడినంత యూరియా అందిస్తాం

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి

కంకిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడినంత యూరియాను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి అన్నారు. మండలంలోని పలు సొసైటీల్లో బుధవారం ఆమె పర్యటించి రైతులతో మాట్లాడారు. మండలంలోని ఉప్పలూరు, పునాదిపాడు, ప్రొద్దుటూరు, నెప్పల్లి సొసైటీలకు 15 టన్నుల చొప్పున, గొడవర్రు పరిధిలోని గొడవర్రు, మద్దూరు గ్రామాలకు పది టన్నుల చొప్పున యూరియా అందించడం జరిగిందన్నారు. యూరియా అక్రమంగా తరలిపోకుండా సొసైటీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన రైతులకు అవసరమైన మేర యూరియా పంపిణీ చేయాలని సూచించారు.



డాక్టర్ దుర్గా దూబేను సత్కరిస్తున్న సిద్దార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు

ఇంజనీరింగ్ విద్యార్థులు
సైబర్ సెక్యూరిటీకి పునాది వేసుకోవాలి

కానూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు పటిష్టమైన సైబర్ సెక్యూరిటీకి పునాది ఏర్పాటు చేసుకోవాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఇన్ఫర్మేషన్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ హెడ్ డాక్టర్ దుర్గా దూబే అన్నారు. కానూరులోని సిద్దార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వర్సిటీలో బుధవారం ఎవాల్వింగ్ సైబర్ సెక్యూరిటీ ప్యారడైగమ్స్ ఇండస్ట్రీ ఇన్‌సైట్స్ ఫర్ యాస్పిరింగ్ ఇంజనీర్స్ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో దుర్గా దూబే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, ప్రొ.వీసీ ఏవీ రత్నప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు డి. వెంకటేశ్వరరావు, సునీత, రాజేశ్వరరావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రాము కొకైన్ పట్టివేత

పెనమలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప శ్రీనివాసనగర్ కట్టకు చెందిన నక్క పార్థసారథి గ్రీన్‌స్పేస్ అపార్టుమెంట్ ఎదురుగా నివాసం ఉంటాడు. ఇతనికి గంజాయి సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో తన స్నేహితుడు నాగవరపు గుణశేఖర్ పదిహేనురోజుల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చి తనకు ఐదువేల విలువైన ఒక గ్రాము కొకైన్ ప్యాకెట్ అమ్మమని ఇచ్చినట్లు తెలిపాడు. నిందితుని మీద అనుమానంతో అతడిని తనిఖీ చేయగా కొకైన్ ప్యాకెట్ లభించిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌లో ప్లాస్టిక్ వినియోగంపై నోటీసులు



హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు వ్యవసాయ కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ గన్నవరం ఏఎంసీ కమిటీ బుధవారం నోటీసులు జారీ చేసింది. కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు ఆదేశాలు మేరకు కమిటీ డైరక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో యార్డు సిబ్బంది వ్యాపారులు, కాటా నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. అక్టోబరు 1 నుంచి క్యారీ బ్యాగులను వినియోగిస్తే రూ. వెయ్యి జరిమాన విధించడం జరుగుతుందని పేర్కొంటూ నోటీసులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పొట్లూరి ఫణి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ పునరుద్ధరించాలి



విజయవాడ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నున్న లోని కోటగట్టు సెంటర్ వద్ద వాటర్ ప్లాంట్ పునరుద్ధరించాలని కోరు తూ ఎంపీటీసీ సభ్యులు బుధవారం ఏపీసీఎస్ సీఈవో రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్తులకు తాగునీరు అందించే మినరల్ వాటర్ ప్లాంట్ గత కొంత కాలంగా మూతబడిందని దీని కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్లాంట్‌ను త్వరితగతిన పునరుద్ధరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంపీటీసీ సభ్యులు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రత్తిపాటి నాని, వార్డు సభ్యులు సుందరయ్య, ఏఎంసీ మాజీ డైరక్టర్ దండు సుబ్రహ్మణ్యం రాజు, గడ్డం కుమార్‌లు ఉన్నారు.

రైతులకు యూరియా కష్టాలను తీర్చాలి

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయని సీపీఐ ఏరియా కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో యూరియా కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎరువుల చీకటి విక్రయాలను అరికట్టి రైతాంగానికి పారదర్శకంగా అందజేయాలన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం యూరియా సరఫరా చేయటంలో విఫలమైందన్నారు. రైతు సంఘ నాయకులు గొంది శోభన చలపతిరావు, నూతక్కి మోహనరావు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని కంటి వైద్యురాలు డాక్టర్ ప్రజ్ఞ అన్నారు. రైస్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు ఉయ్యూరు శారద ఆంజనేయులు ఆధ్వర్యంలో పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం గ్రామాల్లో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కంటి సమస్యలు వచ్చినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 76మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

ఆయుష్మాన్ భారత్
ఆరోగ్య హామీ పథకంపై అవగాహన

ఉంగుటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) పథకంపై స్పష్టమైన అవగాహన కలిగివుండాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. జాతీయ ఆరోగ్య సంరక్షణ మిషన్‌లో భాగంగా బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ యోజన పథకంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



నష్టపరిహారం చెల్లించాలి

మల్లవల్లి పారిశ్రామికవాడ భూనిర్వాసిత రైతులు



సమావేశంలో పాల్గొన్న రైతులు దోనవల్లి వెంకట్రావు, పంతం కామరాజు, యర్రంశెట్టి రాము

హనుమాన్‌జంక్షన్ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధి కోసం సాగు భూములను ఇచ్చి, రెవెన్యూ రికార్డుల్లో నష్టపరిహారం అందలేదని చూపుతున్నా ఇంతవరకూ తమకు న్యాయం జరగలేదని మల్లవల్లి పారిశ్రామికవాడ భూనిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడలోని నరసింహస్వామి దేవాలయం వద్ద బుధవారం భూనిర్వాసిత రైతులు సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రకటించారు. జియోకాన్ సర్వే ప్రకారం 67మందికి నష్టపరిహారం అందలేదని, రెవెన్యూ రికార్డుల ప్రకారం మొత్తం 124మందికి నష్టపరిహారం అందలేదని 2022లో అప్పటి తహసీల్దార్ నరసింహారావు ఇచ్చిన నివేదికను చూపించారు. నివేదిక ప్రకారం రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని రెవెన్యూశాఖ తేల్చినా, రైతులందరికీ నష్టపరిహారం ఇచ్చేశామని చెపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశోక్ లేలాండ్ పరిశ్రమ ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో వినతిపత్రం అందించినా ఇప్పటి వరకూ తమకు న్యాయం జరగలేదని వాపోయారు. ప్రభుత్వం మారితే న్యాయం జరుగుతుందనుకున్నామని, తప్పని పరిస్థితుల్లో కలెక్టరుకు వినతిపత్రం అందజేసి నిరసన కార్యాచరణ మొదలుపెట్టనున్నట్లు రైతులు వివరించారు. తమకు న్యాయం జరక్కపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు త్వరలోనే (20వ తేదీ తరువాత) విజయవాడలోని ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టనున్నట్లు రైతులు దోనవల్లి వెంకట్రావు, పంతం కామరాజు, జనసేన నాయకుడు యర్రంశెట్టి రాము, తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసం రామకృష్ణ, జలసూత్రం ఆంజనేయులు, వేముల వెంకటస్వామి, ముక్కు శేఖర్, తోటపల్లి కవిత, అక్కింశెట్టి నరసింహారావు తదితర రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా జనసేన: బండ్రెడ్డి



రాధాకృష్ణ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న రామకృష్ణ

కంకిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల కుటుంబాలకు జన సేన అన్ని వేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమా దంలో మరణించిన పిల్లా రాధాకృష్ణకు సభ్యత్వం ద్వారా వచ్చిన ఇన్సూరెన్సు సొమ్ము రూ. 5 లక్షల చెక్కును బుధ వారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రచార కమిటీ జిల్లా కోఆర్డినేటర్ పులి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు సుంకర శివ, గ్రామ పార్టీ అధ్యక్షులు బోయిన నాగరాజు, పార్టీ నాయకులు ముప్పా రాజ, సుంకర సురేష్, కుంటా గంగాధర్, కోన నాని, తోట సతీష్ పాల్గొన్నారు.

ఉయ్యూరు : కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. ఉయ్యూరుకు చెందిన పార్టీ క్రియాశీలక కార్యకర్త దేవబత్తుల సంతోశ్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి పార్టీ నుంచి రూ. 5లక్షల చెక్కును బుధవారం అందజేశారు. కంకిపాడు పీఏసీఎస్ చైర్మన్ సుంకర శివ, పార్టీనాయకులు బోయిన నాగరాజు, బూరెల రవి, కొండా తదితరులు సంతోశ్ కుటుంబానికి ధైర్యం చెప్పారు.

ఇళ్ల పట్టాలు రద్దు చేయొద్దు

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన బుధవారం జరిగింది. పలువురు అధికారులు తమ నివేదికలను సమర్పించారు. తహసీల్దార్ కేవీ శివయ్య మాట్లాడుతూ, గతంలో రీసర్వే సక్రమంగా జరిగిందన్నారు. మళ్లీ ఏడు గ్రామాల్లో రీసర్వే ప్రారంభం కానుందన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలపై సర్వే జరుగుతుందన్నారు. అనర్హులుంటే ఇంటి పట్టా రద్దు అవుతుందని చెప్పారు. దీనికి సూరంపల్లి సర్పంచ్ ఈడ్రోలు వాసు స్పందిస్తూ ఇచ్చిన పట్టాలను రద్దు చేయటం సరికాదన్నారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నర్సయ్య, వైస్ ఎంపీపీలు కొమ్మరాజు సుధీర్, సాతులూరి శివనాగ రాజ కుమారి, జడ్పీటీసీ ఏఈ రాణి, ఎంపీడీవో టి.స్వర్ణలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో జి.మంగమ్మ

బాల్య వివాహాలను అరికట్టాలి

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయిలో ఐసీడీఎస్ అధికారులకు సహరించాలని సీడీపీవో జి.మంగమ్మ అన్నారు. స్థానిక జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. చిన్న నాటి నుంచే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన పండ్లను తినాలని వివరించారు. హెచ్ఎం పార్వతీ, సూపర్‌వైజర్‌లు సీహెచ్ నాగపద్మావతి, జె.సత్యవాణి, జయలక్ష్మీ, ఏఎన్ఎం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉయ్యూరు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కిశోర బాలికలు, మహిళల్లో రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి. శ్రావణి అన్నారు. కాటూరు హైస్కూల్‌లో బుధవారం కిశోర బాలికల్లో రక్తహీనత, మహిళల ఆరోగ్య సమస్యలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శ్రావణి పాల్గొని పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని ఎంఎస్‌కె మేరీ హేమలత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పామర్తి నగర్ రవణమ్మ చెరువు, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, మల్లికార్జున హైస్కూల్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్‌కు యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు సంబంధించిన సేవా పుస్తకంలో నమోదులను సకాలంలో నమోదు చేయాలన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జీవీ రవిబాబు, దాసరి శివప్రసాద్, తాత శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న బోడె వెంకట్రామ్

108 వాహనం ప్రారంభం

ఉయ్యూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో న్యూలైఫ్ 108 అంబులెన్స్ వాహనాన్ని బోడె వెంకట్రామ్ ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణతో కలసి బుధవారం ప్రారంభించారు. 108 అంబులెన్స్‌కు నూతన వాహనం ఏర్పాటు చేయగా స్థానిక ఆర్అండ్‌బీ బంగళా ఆవరణలో టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, గుర్నాధరావు, అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, ఈఎం వెంకటేశ్వరరావు, అఖిల్, నాగరాజు, గంగాభవాని, రామ్మోహన్‌రావు, శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

కొత్తగా 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు



గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం ఓటరు నమోదు అధికారి టి.శివరామప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగింది. 1200 ఓట్లు దాటిన పోలింగ్ బూత్‌లు నియోజకవర్గ పరిధిలో 41 ఉన్నాయని, కొత్తగా 20 పోలింగ్ బూత్‌లు, కొన్ని బూత్‌లలో మార్పు చేర్పులు ఉన్నట్లు తెలిపారు. కుటుంబంలో ఓటర్లు మొత్తం ఒకే పోలింగ్ బూత్‌లో ఉండే విధంగా కరెక్షన్స్ చేసి చర్చించటం జరిగిందన్నారు. టీడీపీ నుంచి బోడపాటి రవికుమార్, టి.శ్రీనివాస రావు, బీజేపీ నాదెండ్ల మోహన్, సీపీఐ కాట్రగడ్డ రామచంద్రజోషి, జనసేన కిరణ్‌కుమార్, వైసీపీ నీలం ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు కేవీ శివయ్య పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్‌గా వేమూరి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా అప్పనవీడుకు చెందిన టీడీపీ నేత వేమూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు పాలక మండలి సభ్యుల నియామక ఉత్తర్వులు ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి అందినట్లు దేవస్థానం ఈవో పి. తారకేశ్వరరావు బుధవారం తెలిపారు. మండలి సభ్యులుగా మరో 10 మందిని నియమించినట్లు తెలిపారు. ఈ నెలాఖరున పాలక మండలి ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం.

ఆదిత్య బధిర విద్యాలయానికి ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదవారికి మానవత ఎల్లప్పుడు అండగా ఉంటుందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారు బోయిన కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో ఆదిత్య బధిర విద్యాలయానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. మానవత సభ్యుడు జీవీకే నారాయణ తన మనవడు దీపక్ ఎమ్మెస్‌లో సీటు సంపాదించిన సందర్భంగా ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత నిర్వాహకులు పాబోలు గణేష్, ఇందిరాదేవి, సుబ్బాచారి, ఘంటా సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, కొట్నేని రామచంద్రరావు, వెంకటస్వామి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ, సనాతన ధర్మాన్ని
ముందుకు తీసుకువెళ్లటమే లక్ష్యం

గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సమష్టి కృషి చేస్తున్నట్లు గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు తెలిపారు. గన్నవరం పార్క్ ఎలైట్ హోటల్‌లో బుధవారం గణేష్ ఉత్సవ సమితి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, గణేష్ ఉత్సవ సమితి మూడు అంశాలను తీసుకుందని చెప్పారు. ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణపై జిల్లాలో క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. సమితి ఏర్పడిన రోజుల వ్యవధిలోనే రాష్ట్ర అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులను కలసినట్లు చెప్పారు. కార్యదర్శి మణీంద్రనాథ్, కోనేరు దుర్గా ప్రసాద్, శివాజీ, పొట్లూరి బసవరావు, బి.రవిశంకర్, అశోక్, వెంకటాద్రి రెడ్డి, వీరబాబు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు



సీఎం సహాయనిధి ఎల్వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి పేదలకు వరం

పెనమలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి బడుగు బలహీన వర్గాల ప్రజలకు వరంలాంటిదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పోరంకిలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తాడిగడప, పెదపులిపాక, మారేడుమాక గ్రామాలకు చెందిన దాసరి రాంబాబు, వెలిసెల ఫ్రాన్సిస్, మానికొండ నాగలక్ష్మిలకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం 5.25 లక్షల విలువైన ఎల్వోసీ పత్రాలను అందజేసి ఎమ్మెల్యే మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధిని ఉపయోగించుకొని తమ ఇబ్బందులను తొలిగించుకోవడంలో తాను సహాయపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కొమ్మినేని వెంకటేష్, శొంఠి శివరాంప్రసాద్, సంగెపు రంగారావు, బొంగరాల అబ్రహం పాల్గొన్నారు.

20 మందిపై బైండోవర్ కేసులు

ఉయ్యూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఊరేగింపులో రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తించిన 20 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, రెండురోజుల క్రితం జరిగిన వినాయక నిమజ్జన ఊరేగింపులో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తించిన ఉయ్యూరులో వివిధ ప్రాంతాలకు చెందిన 20 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు.



స్పోర్ట్స్

అన్‌సీడెడ్ చేతిలో..

● సింధు పరాజయం

● ప్రణయ్, సేన్ ముందంజ

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు హాంకాంగ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ భారత స్టార్ అనూహ్యంగా ఆదిలోనే అన్‌సీడెడ్ చేతిలో పరాజయం పాలై నిరాశపరిచింది. డెన్మార్క్‌కు చెందిన క్రిస్టోఫర్సెన్ 15-21, 21-16, 21-19తో సింధుకు షాకిచ్చి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 22-20, 16-21, 21-15తో తైపీ ఆటగాడు వాంగ్ జు వీపై, ప్రణయ్ 21-17, 21-14తో చైనా షట్లర్ లూ గువాంగ జూపై, ఆయుష్ శెట్టి 15-21, 21-19, 21-13తో సూ లి యాంగ్ (తైపీ)పై, కిరణ్ జార్జ్ 21-16, 21-11తో జియా హెంగ్ జాసన్ తె (సింగపూర్)పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్‌లో రీతుపర్ణ పండా/శ్వేతపర్ణ పండా జోడీ 21-17, 21-9తో స్థానిక జంట వానెస్సా పాంగ్/సమ్ యూ వాంగ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. సింగిల్స్‌లో రక్షిత రామరాజు, అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా/ధ్రువ్ కపిల, రుత్వికా శివాని/రోహన్ కపూర్ ద్వయం జోడీలు ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

బిష్ణోయ్‌కు 6, అర్ష్‌దీప్‌నకు 10

దుబాయ్: టీమిండియా బౌలర్లు రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో చెరోస్థానం మెరుగుపర్చుకుని ముందంజ వేశారు. వీరు వరుసగా 6, 10వ ర్యాంకుల్లో నిలిచారు. వరుణ్ చక్రవర్తి 4వ ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత్ తరఫున టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ నెంబర్‌వన్ ర్యాంక్‌ను పదిలం చేసుకున్నాడు.

అమ్మాయిలు..అదే జోరు



సూపర్-4లో కొరియాపై భారత్ గెలుపు

ఆసియా కప్ హాకీ

హాంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. టోర్నీలో ఒక్క ఓటమి కూడా కూడా లేకుండా గ్రూప్ దశను టాపర్‌గా ముగించిన మన అమ్మాయిల బృందం.. సూపర్-4లోనూ అంతేదీటుగా విజృంభిస్తోంది. బుధవారం జరిగిన సూపర్-4 తొలి పోరులో భారత్ 4-2తో కొరియాను చిత్తు చేసింది. భారత జట్టులో వైష్ణవి (2వ), సంగీతా కుమారి (33వ), లాల్‌రెమ్సియామి (40వ), రుతుజ (59వ) తలో గోల్ సాధించారు. కొరియా తరఫున యుజిన్ కిమ్ (33వ, 53వ) రెండు గోల్స్ చేసింది. భారత్ తమ రెండో మ్యాచ్‌ను గురువారం చైనాతో ఆడనుంది. నాలుగు జట్లు తలపడే సూపర్-4లో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరతాయి.

27 బంతుల్లోనే..

భారత్ సునాయాస విజయం

యూఏఈ 57 ఆలౌట్

కుల్దీప్‌కు 4, దూబేకి 3 వికెట్లు



దుబాయ్: డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. ఆసియా కప్‌లో ఘనంగా బోణీ చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్ (4/7), శివం దూబే (3/4) తిప్పేయడంతో.. గ్రూప్-ఎలో బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. 79 బంతుల్లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన టీమిండియా.. కేవలం 27 బంతుల్లోనే లక్ష్యాన్ని ఊదేసింది. దీంతో మొత్తం 106 బంతుల్లోనే మ్యాచ్ ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ 13.1 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. అలీషాన్ షరాఫు (22), మహ్మద్ వసీం (19) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. శివం దూబే మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 4.3 ఓవర్లలో 60/1 స్కోరు చేసి గెలిచింది. అభిషేక్ శర్మ (30), శుభ్‌మన్ గిల్ (20 నాటౌట్) రాణించారు. జునైద్ ఒక వికెట్ దక్కించుకొన్నాడు.

అలవోకగా..: స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్లు అభిషేక్, గిల్ ప్రత్యర్థి బౌలింగ్‌ను ఉతికి ఆరేశారు. తొలి బంతినే సిక్స్‌కు తరలించిన శర్మ.. రెండో బంతికి బౌండ్రీ సాధించాడు. రెండో ఓవర్‌లో రోహిద్ బౌలింగ్‌లో గిల్ 4,6తో 15 పరుగులు రాబట్టడంతో స్కోరు బోర్డు దూసుకెళ్లింది. మరో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టిన అభిషేక్‌ను జునైద్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 10 పరుగులు కావల్సి ఉండగా.. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ (7 నాటౌట్) ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. మరో వైపు బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేసిన గిల్.. మరో 93 బంతులు మిగిలుండగానే జట్టుకు ఘన విజయం అందించాడు.

పెవిలియన్‌కు క్యూ..: పవర్‌ప్లేలో ఫర్వాలేదనిపించినా.. కుల్దీప్ స్పిన్ ఉచ్చులో చిక్కుకొన్న యూఏఈ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈకి ఓపెనర్ అలీషాన్ మెరుగైన ఆరంభాన్నే ఇచ్చాడు. పాండ్యా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదాడు. బుమ్రా బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన షరాఫు.. అక్షర్ వేసిన మూడో ఓవర్‌లో సిక్స్‌తో బ్యాట్ ఝుళిపించాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా యార్కర్‌కు అలీషాన్ పెవిలియన్ చేరాడు. దీంతో తొలి వికెట్‌కు 26 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్ బ్యాటర్ జొహైబ్ (2)ను వరుణ్ క్యాచవుట్ చేశాడు. కానీ, ఆరో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో వసీం మూడు బౌండ్రీలతో 12 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను యూఏఈ 41/2తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో కుల్దీప్ మాయాజాలంతో ఒక్కసారిగా కుదేలైంది. 8వ ఓవర్‌లో రాహుల్ చోప్రా (3), వసీంతోపాటు హర్షిత్ కౌశిక్ (2)ను కుల్దీప్ అవుట్ చేయడంతో.. యూఏఈ 50/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆసిఫ్ ఖాన్ (2), ధ్రువ్ (1), జునైద్ సిద్దిఖీ (0)ను దూబే పెవిలియన్ చేర్చాడు. హైదర్ అలీ (1)ను క్యాచవుట్ చేసిన కుల్దీప్.. యూఏఈ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ × హాంకాంగ్
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

స్కోరుబోర్డు

యూఏఈ: అలిషన్ షరాఫు (బి) బుమ్రా 22, మహ్మద్ వసీమ్ (ఎల్బీ) కుల్దీప్ 19, జొహైబ్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 2, రాహుల్ చోప్రా (సి) గిల్ (బి) కుల్దీప్ 3, ఆసిఫ్ (సి) శాంసన్ (బి) దూబే 2, హర్షిత్ (బి) కుల్దీప్ 2, ధ్రువ్ పరాషర్ (ఎల్బీ) దూబే 1, సిమ్రన్‌జీత్ (ఎల్బీ) అక్షర్ 1, హైదర్ (సి) శాంసన్ (బి) కుల్దీప్ 1, సిద్దిఖీ (సి) సూర్య (బి) దూబే 0, మహ్మద్ రోహిద్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.1 ఓవర్లలో 57 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-47, 4-48, 5-50, 6-51, 7-52, 8-54, 9-55, 10-57; **బౌలింగ్:** హార్దిక్ 1-0-10-0, బుమ్రా 3-0-19-1, అక్షర్ 3-0-13-1, వరుణ్ చక్రవర్తి 2-0-4-1, కుల్దీప్ 2.1-0-7-4, శివమ్ దూబే 2-0-4-3.

భారత్: అభిషేక్ (సి) హైదర్ (బి) సిద్దిఖీ 30, గిల్ (నాటౌట్) 20, సూర్యకుమార్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 3, మొత్తం: 4.3 ఓవర్లలో 60/1; వికెట్ పతనం:** 1-48; **బౌలింగ్:** హైదర్ 1-0-10-0, రోహిద్ 1-0-15-0, పరాషర్ 1-0-13-0, సిద్దిఖీ 1-0-16-1, సిమ్రన్‌జీత్ సింగ్ 0.3-0-6-0.

1

4.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేధించిన భారత్.. టీ20ల్లో తన వేగవంతమైన ఛేదనను నమోదు చేసింది. గతంలో స్కాట్లాండ్‌పై 6.3 ఓవర్లలోనే ఛేదించిన రికార్డును టీమిండియా ఈ మ్యాచ్‌లో తిరగరాసింది.

టైటాన్స్ హ్యాట్రిక్

ముంబాపై గెలుపు ● ప్రొ కబడ్డీ



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ విశాఖపట్నం అంచెను తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్ విజయంతో ముగించింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 45-37 స్కోరుతో యు ముంబాను చిత్తుచేసింది. టైటాన్స్ రైడర్లు, డిఫెండర్లు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. తొలి భాగంలో టైటాన్స్‌ను ముంబా ఆటగాళ్లు నిలువరించలేకపోయారు. దీంతో ప్రథమార్థం 27-11తో ముగిసింది. ద్వితీయార్థంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్ల అదే జోరు కొనసాగించి మరోసారి యు ముంబాను ఆలౌట్ చేసి సురక్షితమైన ఆధిక్యాన్ని సాధించారు. టైటాన్స్ ధాటికి ఒత్తిడికి గురైన ముంబా వరుస లైనౌట్‌లతో పాయింట్లు సమర్పించుకుంది. చివరి నిమిషాలలో అనూహ్యంగా పుంజుకున్న ముంబా ఆటగాళ్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేసినా ఫలితం లేకపోయింది. టైటాన్స్‌లో రైడర్ భరత్ 13 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించగా, యు ముంబాలో సందీప్‌కుమార్, అమి మహ్మద్ జఫర్ దనేష్ చెరో ఏడు పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 43-32తో యూపీ యోధాస్‌ను ఓడించింది.

నిఖత్‌కు నిరాశ

క్వార్టర్స్‌లో ఓటమి

సెమీఫైనల్‌కు నూపుర్, జాస్మిన్

భారత్‌కు రెండు పతకాలు ఖరారు

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్



నిఖత్



నూపుర్ షెరాన్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో టైటిల్ మిస్సయింది. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ పోరాటం ఈసారి క్వార్టర్‌ఫైనల్‌కే పరిమితమైంది. గతసారి (2023) 50 కిలోలు, అంతకుముందు (2022) 52 కిలోల విభాగాలలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి 51 కిలోల బరిలో దిగింది. అయితే బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జరీన్ 0-5తో రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో చిత్తయింది. దాంతో టోర్నీ నుంచి నిఖత్ రిక్తహస్తాలతో వెనుదిరిగింది. అయితే, నిఖత్ నిరాశపరిచినా.. హరియాణా బాక్సర్లు నూపుర్ షెరాన్, జాస్మిన్ లంబోరియా తమ విభాగాల్లో సత్తా చాటి భారత్‌కు రెండు పతకాలు ఖాయం చేశారు. మహిళల 80+ కేజీల విభాగంలో నూపుర్, 57 కిలోల కేటగిరిలో జాస్మిన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దిగ్గజ బాక్సర్ హవా సింగ్ మనుమరాలైన 26 ఏళ్ల నూపుర్ క్వార్టర్‌ఫైనల్లో 4-1తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒల్టినోయ్ సొతింబేవను చిత్తు చేసింది. మరో క్వార్టర్స్ బౌట్‌లో జాస్మిన్ 5-0తో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ ఖుమొరాబోను మమజొనొవాటపై గెలిచింది. సెమీఫైనల్స్‌లో ఓడినా వీళ్లకు కాంస్య పతకాలు దక్కుతాయి. ఇక..పురుషుల కేటగిరీలో జాదుమని సింగ్ (48 కి), అభినాష్ జమ్వాల్ (65 కి) క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టి పతకానికి ఒక్క విజయం దూరంలో నిలిచారు. కాగా, మరో భారత బాక్సర్ జుగ్నూ అహ్లావత్ (85 కి) తొలి రౌండ్ పరాజయంతో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.

భారత్-పాక్ మ్యాచ్‌కు తగ్గిన డిమాండ్!

పూర్తిగా అమ్ముడుపోని టికెట్లు

దుబాయ్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అంటే టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ రెండు జట్లు తొలిసారిగా తలపడనుండడంతో.. డిమాండ్ భారీగా ఉంటుందని అంచనా వేశారు. కానీ, ఆసియాకప్‌లో ఆదివారం జరిగే ఇండో-పాక్ మ్యాచ్ టికెట్లు ఇంకా అందుబాటులో ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. హైవోల్టేజ్ మ్యాచ్‌కు డిమాండ్ తగ్గడానికి అధిక ధరలే కారణమని తెలుస్తోంది. రెండు సీట్లకు రూ. 10,000 అన్నింటికంటే తక్కువ. వీఐపీ రాయల్ బాక్స్‌లో జతకు రూ. 2,30,700, స్కైబాక్స్ టికెట్ రూ. 1,67,851గా నిర్ణయించారు. ప్లాటినం రూ. 75,658, గ్రాండ్ లాంజ్ రూ. 41,153 లాంటి మధ్య శ్రేణి టికెట్లు కూడా సగటు ప్రేక్షకుడికి అందుబాటులో లేవు.

తుపాకీ గురిపెట్టి..క్రికెటర్ల దోపిడీ

బార్బడోస్‌లో ఘటన

బార్బడోస్: కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో సెయింట్ కిట్స్, నెవిస్ పాట్రియాట్స్ జట్టు ఆటగాళ్లు దోపిడీకి గురయ్యారు. ఆ క్రికెటర్లు, సీపీఎల్ అధికారి ఒకరు ఓ ప్రయివేట్ ఈవెంట్‌ను ముగించుకొని మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హోటల్‌కు వెళుతూ మార్గమధ్యంలో ఆహారంకోసం ఒకచోట ఆగారు. ఆ సమయంలో కొందరు దొంగలు.. క్రికెటర్లు, ఆ అధికారిని తుపాకీతో బెదిరించి నగలు, ఇతర విలువైన వస్తువులు దోచుకొన్నారు. ఈక్రమంలో క్రికెటర్లు దొంగలను ప్రతిఘటించగా వారి మధ్య పెనుగులాట జరిగింది. పెనుగులాటలో దొంగలు ఓ తుపాకీని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ ఘటనలో క్రికెటర్లు సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలి నుంచి పోలీసులు ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

మస్క్‌ను వెనక్కి నెట్టిన ల్యారీ ఎల్లిసన్

ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానానికి



న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్ సహ-వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ ప్రపంచ ధనవంతుల జాబితాలో టెస్లా సారథి ఎలాన్ మస్క్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి ఎగబాకారు. ఫోర్బ్స్ రియల్ టైం బిలియనీర్స్ లిస్ట్ ప్రకారం.. 81 ఏళ్ల ఎల్లిసన్ వ్యక్తిగత సంపద బుధవారం ఏకంగా 10,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.8.89 లక్షల కోట్లు) పెరిగి మొత్తం రూ.39,570 కోట్ల డాలర్లకు (రూ.34.82 లక్షల కోట్లు) చేరుకుంది. ఒరాకిల్ షేరు ఒక్కరోజే ఏకంగా 41 శాతం పెరగడం ఇందుకు దోహదపడింది. 1992 తర్వాత ఒక్క రోజులో కంపెనీ షేరు ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. దాంతో ఒరాకిల్ మార్కెట్ విలువ 29,900 కోట్ల డాలర్ల మేర పెరిగి లక్ష కోట్ల డాలర్లకు చేరువైంది. ప్రస్తుతం సంస్థలో ఎల్లిసన్ 41 శాతం వాటా కలిగి ఉన్నారు. ఒరాకిల్ త్రైమాసిక పనితీరు మార్కెట్ అంచనాలను మించడంతోపాటు క్లౌడ్ వ్యాపారం భవిష్యత్‌పై అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం కంపెనీ షేర్లు భారీగా ర్యాలీ తీశాయి. కాగా, ప్రపంచ కుబేరుల జాబితాలో 300 రోజులుగా అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చిన మస్క్ రెండో స్థానానికి జారుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 38,500 కోట్ల డాలర్లకు (రూ.33.88 లక్షల కోట్లు) పరిమితమైంది.

మూడో రోజూ లాభాల్లో సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో అప్‌ట్రెండ్ బుధవారం నాడు కూడా కొనసాగింది. సెన్సెక్స్ *323.83* పాయింట్ల లాభంతో *81,425.15* వద్ద ముగియగా నిఫ్టీ *104.5* పాయింట్ల లాభంతో *24,973.10* వద్ద ముగిసింది. సెన్సెక్స్ లాభాలతో ముగియడం వరుసగా ఇది మూడో రోజు కాగా నిఫ్టీకి ఆరో రోజు. భారత-అమెరికా వాణిజ్య చర్చలు త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే రావచ్చునన్న ఆశలు, జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ భాగంలో కంపెనీల ఆదాయాలు బాగా పుంజుకుంటాయన్నఅంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్ల కూడా ఇందుకు తోడయ్యాయి.

● బుధవారం ప్రారంభమైన అర్బన్ కంపెనీ ఐపీఓకు మదుపరులు బ్రహ్మరథం పట్టారు. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొద్ది సేపటికే ఇష్యూ మొత్తం సబ్‌స్క్రైబ్ అయింది. తొలి రోజు ముగిసే సరికి *3.13* రెట్లు సబ్‌స్క్రైబ్ అయినట్టు సమాచారం.

ఎంఎఫ్ లావాదేవీల్లో ఎన్ఎస్ఈ రికార్డు: మ్యూచువల్ ఫండ్ లావాదేవీల్లో 'ఎన్ఎస్ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫాం' రికార్డు సృష్టించింది. బుధవారం ఈ వేదికపై రికార్డు స్థాయిలో *15* లక్షలకుపైగా లావాదేవీలు నమోదైనట్టు ఎన్ఎస్ఈ తెలిపింది. సభ్యులు, డిస్ట్రిబ్యూటర్ల నమ్మకం, మద్దతుతోనే ఇది సాధ్యమైందని ఎన్ఎస్ఈ పేర్కొంది.

బిజినెస్

రూ.35 తగ్గనున్న సిమెంట్ ధర

ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలతో సిమెంట్ ధరలు దిగి రానున్నాయి. ఈ తగ్గింపు 50 కిలోల బస్తాపై రూ.30 నుంచి రూ.35 వరకు ఉంటుందని ఇండియా రేటింగ్స్ అంచనా. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర కంపెనీని బట్టి రూ.330 నుంచి రూ.370 వరకు పలుకుతోంది. జీఎస్‌టీ ప్రయోజనాలను ఈ నెల 23 నుంచి వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలు భావిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే రిటైల్ మార్కెట్‌లోనూ బస్తా సిమెంట్ ధర రూ.30 నుంచి రూ.35 వరకు తగ్గుతుందని అంచనా.

ఎస్ఎస్ఎల్‌వీ తయారీ కోసం 3 కంపెనీలతో హెచ్ఏఎల్ ఒప్పందం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): 500 కిలోల కన్నా తక్కువ బరువు గల ఉపగ్రహాల ప్రయోగానికి స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ) తయారీ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) మధ్య సాంకేతిత బదిలీ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా హెచ్ఏఎల్ ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్లను సొంతంగా అభివృద్ధి చేయడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా స్వీకరిస్తుంది. ఇందుకోసం వచ్చే రెండేళ్లపాటు హెచ్ఏఎల్‌కు ఇస్రో అవసరమైన శిక్షణ ఇవ్వడంతోపాటు రాకెట్ల అభివృద్ధికి సాంకేతిక మద్దతునివ్వనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	137
వరంగల్	118	గుంటూరు	127
కరీంనగర్	118	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	111
కర్నూలు	118	నెల్లూరు	116
విశాఖపట్నం	141	అనంతపురం	116
గోదావరి	137		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,510 ▲	1,01,300 ▲	1,40,000 ▲
విజయవాడ	1,13,000 ▲	1,07,000 ▲	1,28,270 ▲
విశాఖపట్నం	1,12,990 ▲	1,01,300 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,510 ▲	1,01,300 ▲	1,27,900 ▼
ప్రొద్దుటూరు	1,13,700 ▲	1,04,600 ▲	1,28,000 ▼
ముంబై	1,09,640 ▲	1,00,430 ▲	1,24,590 ▼

కృత్రిమ మేధతో ప్రపంచ జీడీపీకి అదనంగా రూ.1,382 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) 21వ శతాబ్దిని నిర్వచించే టెక్నాలజీగా మారిందని, 2030 నాటికి ప్రపంచ జీడీపీకి ఇది 1570 కోట్ల డాలర్లు (రూ.1,382 లక్షల కోట్లు) జోడిస్తుందని ఫిక్కీ-బీసీజీ రూపొందించిన ఒక శ్వేతపత్రంలో అంచనా వేశాయి. అయితే ఏఐని అనుసరించే విషయంలో మాత్రం భారీ వ్యత్యాసాలున్నట్టు ఆ పత్రంలో తెలిపాయి. ప్రపంచ సమ్మిళిత వృద్ధికి ఏఐని ఒక సాధనంగా చేసుకోవాలని పిలుపు ఇచ్చాయి. ఏఐని అందరికీ అందుబాటులోకి తేవడానికి పరిశోధన, పెట్టుబడులు, నైపుణ్యాల కల్పన, నైతిక (రైజ్) నియమావళి అనుసరించాలని సూచించాయి. అందులోని ప్రధానాంశాలు...

● ఈ రంగంలో పరిశోధనలు, ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి.


● ఏఐని అందరికీ ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాలకు అందుబాటులోకి తేవడం లక్ష్యంగా పెట్టుబడులు, మౌలిక వసతులు విస్తరించాలి.

● ఏఐ ప్రతిభలో వ్యత్యాసాలు తొలగించేందుకు సిబ్బందిలో నైపుణ్యాలకు మెరుగులు దిద్దడంతో పాటు ఏఐ పరిజ్ఞానాన్ని అందరూ భారీ ఎత్తున పంచుకునే వాతావరణం సృష్టించాలి.

● ఏఐ వ్యవస్థలు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా ఉండేలా చూసేందుకు శక్తివంతమైన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

23 నుంచి గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

అమెజాన్ ఇండియా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025 ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రైబర్లు ఒక రోజు ముందే ఇందులో పాల్గొనవచ్చు. ఈ ఫెస్టివల్‌లో 17 లక్షల మందికి పైగా అమ్మకందారులు తమ ఉత్పత్తులను అమ్మకానికి పెడుతున్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అమ్మకందారులే 80,000 వరకు ఉంటారని అమెజాన్ ఇండియా డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్) తేట కిషోర్ చెప్పారు. రెండు రాష్ట్రాల్లోని 700కుపైగా డెలివరీ కేంద్రాల ద్వారా ఈసారి తమ కస్టమర్లకు సరుకులు అందించనున్నట్టు తెలిపారు. జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఏడాది 'అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025' అమ్మకాలు భారీగా పుంజుకుంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ ఫెస్టివల్ అమ్మకాల రద్దీకి అనుగుణంగా సరుకులను కొనుగోలుదారులకు అందించేందుకు లక్షన్నర మంది సీజనల్ ఉద్యోగులను అమెజాన్ ఇండియా నియమించింది. తెలంగాణ సహా దేశంలోని ప్రధాన నగరాల్లో కొనుగోలు దారులు ఎక్కువగా మిడ్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు, టీవీల వంటి కన్జుమర్ ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆసక్తి చూపిస్తున్నట్టు అమెజాన్ ఇండియా డైరెక్టర్ (కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్) జెబా ఖాన్ చెప్పారు.

ఈ ఏడాది వృద్ధి 6.9 శాతం

అంచనాలను పెంచిన ఫిచ్.. దేశీయ డిమాండ్ వృద్ధికి చోదకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరపతి రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో బలమైన వృద్ధి నమోదవడంతో పాటు దేశీయంగా వినియోగం భారీగా పుంజుకోనుండటం ఇందుకు కారణంగా పేర్కొంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ట్రంప్ సుంకాల నేపథ్యంలో పలు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు, బహుళజాతి ఆర్థిక సంస్థలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ వచ్చాయి. ఇలాంటి ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలోనూ వృద్ధి అంచనాలను పెంచిన తొలి అంతర్జాతీయ ఏజెన్సీ ఫిచ్. పైగా అన్ని ఏజెన్సీల్లోకెల్లా అత్యధిక వృద్ధిని అంచనా వేసింది కూడా ఇదే. దేశీయంగా వినియోగం భారీగా పెరగడంతో పాటు ట్రంప్ సుంకాల ప్రభావం నుంచి బయటపడేందుకు జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దోహదపడగలదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెలకుగాను ఫిచ్ విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్ ఔట్‌లుక్ నివేదికలోని మరిన్ని విషయాలు..

● ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 6.7 శాతం వృద్ధిని అంచనా వేయగా.. 7.8 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచుతున్నట్టు తెలిపింది.

● గడిచిన కొన్ని నెలల్లో అమెరికా-భారత్ మధ్య వాణిజ్య అనిశ్చితి పెరిగింది. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఆగస్టు 27 నుంచి 50 శాతానికి పెంచారు. భవిష్యత్‌లో ఈ సుంకం మళ్లీ దిగిరావచ్చని భావిస్తున్నాం. కానీ, అమెరికాతో వాణిజ్య సంబంధాలపై నెలకొన్న అనిశ్చితి వ్యాపార సెంటిమెంట్, పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

● ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్న జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగం పెరిగేందుకు దోహదపడనుంది. దేశీయ డిమాండే వృద్ధికి ప్రధాన చోదకం. బలమైన గృహ ఆదాయం వినియోగానికి, సులభమైన ఆర్థిక పరిస్థితులు పెట్టుబడులకు ఊతమివ్వనున్నాయి.

● ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మాత్రం వృద్ధి కాస్త నెమ్మదించవచ్చు. 2026-27లో వృద్ధిరేటు 6.3 శాతంగా, 2027-28 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతంగా నమోదు కావచ్చని అంచనా.

● ఈ సారి మెరుగైన వర్షపాతం నమోదవడంతో పాటు అధిక స్థాయిలో ఆహార నిల్వలున్న నేపథ్యంలో ధరల సూచీ అదుపులోనే ఉండనుంది. ఈ ఏడాది చివరినాటికి వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3.2 శాతంగా, 2026 చివరినాటికి 4.1 శాతంగా నమోదు కావచ్చని అంచనా.

● ఈ ఏడాది చివర్లో ఆర్‌బీఐ రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించవచ్చు. వచ్చే ఏడాదిలో మాత్రం రెపో యథాతథంగా కొనసాగవచ్చు. ఆర్‌బీఐ 2027లో రెపోరేటును మళ్లీ పెంచేందుకు అవకాశాలున్నాయి.

రాజమండ్రిలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

100 పడకల సామర్థ్యంతో ఏర్పాటు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సేవలను మరింత విస్తరించింది. తాజాగా రాజమండ్రిలో 100 బెడ్ల సామర్థ్యంతో కూడిన ఆస్పత్రిని బుధవారం ప్రారంభించింది. ఏపీలో రెయిన్‌బోకు ఇది మూడో హాస్పిటల్. విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అంతేకాదు, ఈ ఆర్థిక సంవత్సరంలో వరంగల్, గువాహటి తర్వాత రెయిన్‌బో ప్రారంభించిన మూడో హాస్పిటల్ కూడా ఇదే. ఈ విస్తరణతో కలిపి రెయిన్‌బో మొత్తం 9 నగరాల్లో 2,300 పడకల సామర్థ్యంతో కూడిన 22 హాస్పిటళ్లు, 5 క్లినిక్‌లను నిర్వహిస్తోంది.

ఎస్రీ ఇండియాతో ధ్రువ స్పేస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ ఎస్రీ ఇండియాతో హైదరాబాద్ స్టార్టప్ ధ్రువ స్పేస్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ధ్రువ స్పేస్ తన ఆస్ట్రావ్యూ శాటిలైట్ ఇమేజరీ సర్వీస్‌ను ఎస్రీ ఇండియాకు చెందిన ఆర్క్‌జీఐఎస్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించనుంది. తద్వారా 200కు పైగా ఉపగ్రహాల నుంచి భూమి పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు మరింత సులభంగా పొందేందుకు వీలుపడనుంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266



నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

22 నుంచి తాళం భజన, మురళీ కోలాటం పోటీలు

ఘంటసాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చిట్టూర్పులోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 22 నుంచి కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల స్థాయిలో 11 రోజులపాటు తాళం భజన, మురళీ కోలాటం పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకుడు గుత్తికొండ వరప్రసాద్ తెలిపారు. బుధవారం చిట్టూర్పులో పోటీల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనే బృందాలు ఈ నెల 18వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. వివరాలకు 92474 43763, 81793 22189 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

మృతి చెందిన ఆవు కడుపులో
20 కిలోల పాలిథిన్ కవర్లు

● పోస్టుమార్టంలో గుర్తించిన వెటర్నరీ వైద్యులు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై తిరిగే 120 ఆవులను మార్కెట్‌యార్డులోని బృందావన్ గో సంఘంలో ఉంచి, వాటి బాగోగులను నగరపాలక సంస్థ చూస్తోంది. మంగళవారం ఓ ఆవు అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం వెటర్నరీ వైద్యులు ఆవుకు పోస్టుమార్టం చేయగా దాని కడుపులో 20 కిలోల పాలిథిన్ కవర్లు ఉన్నాయి. గో సంఘంలో మరో ఆరు ఆవులు అనారోగ్యంతో ఉన్నాయి. వాటికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోడ్లపై తిరగడం వల్ల ఆవులు పాలిథిన్ కవర్లు తిని అనారోగ్యం బారిన పడినట్టు పశువైద్యులు నిర్ధారించారు. వీటికి వైద్యం చేస్తున్నారు. ఆర్థిక భారమైనప్పటికీ దాతల సహకారంతో బృందావన గో సంఘంలోని ఆవుల పోషణ చూస్తున్నామని మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ పేర్కొన్నారు. ఈ ఆవులను చిన్నతిరుపతి, శ్రీశైలం, పెదముత్తేవి గోశాలలకు పంపాలని యోచిస్తున్నామన్నారు.



ఆవు కడుపులోంచి తీసిన పాలిథిన్ కవర్లు

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక సూచించారు. ఓ ఫంక్షన్ హాలులో బుధవారం నాయకులు, కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీల ప్రతినిధులు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, నాయకులు వై.విజయేంద్రకుమార్, కురుమద్దాలి ఫణికుమార్, బి.వి.ప్రసన్నకుమార్, పంతం గజేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక

17న మునిసిపల్ షాపుల లీజుకు వేలం

పెడన, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4 మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో 23 షాపులను లీజుకు ఇచ్చేందుకు ఈనెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మహాత్మా గాంధీ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 7, బంటుమిల్లి రోడ్డు షాపింగ్ కాంప్లెక్స్‌లో 2, పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 7, మహిళా వాణిజ్య మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 7 షాపులకు వేలం జరుగుతుందని వివరాల కోసం మునిసిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు మండల సమావేశం

గూడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎండీవో కె.వి.రామకృష్ణ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన సూచించారు.

యూరియా కొరత పేరుతో వైసీపీ డ్రామాలు

● ఢిల్లీలో కాళ్ల బేరం..ఇక్కడ నిరసన నాటకాలు

● ప్రజలు అన్నీ గమనిస్తున్నారు: ఏఎంసీ చైర్మన్ కుంచే నాని, టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో యూరియా కొరత పేరుతో వైసీపీ డ్రామాలాడుతోంది. ఢిల్లీలో కాళ్లబేరం..ఇక్కడ నిరసన నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు.' అని మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచేనాని, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'ఎరువుల సరఫరా పూర్తిగా కేంద్రప్రభుత్వ పరిధిలో ఉంటుంది. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు దీనిపై పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర మంత్రితో మాట్లాడి 50 వేల టన్నులు రాష్ట్రానికి కేటాయించేలా చూశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో మీకే మా మద్దతు అని వైసీపీ ఢిల్లీలో బీజేపీ కాళ్లు పట్టుకుంది. ఇక్కడేమో నిరసనల పేరుతో డ్రామాలు ఆడుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కౌలురైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని దేశంలో రెండో స్థానంలో నిలిపింది. ఇప్పుడు రైతుల సమస్యలు అంటూ జగన్ ముఠా చేసే డ్రామాలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు.' అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, ఏఎంసీ చైర్మన్ కుంచే నాని

వైసీపీవి దొంగ ధర్నాలు

● ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

అవనిగడ్డ: రైతు పోరు పేరుతో వైసీపీ నాయకులు దొంగ ధర్నాలు చేస్తున్నారని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019-24 మధ్య కాలంలో వైసీపీ పాలనలో రైతులు పండించిన ధాన్యానికి నగదు చెల్లించలేని జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని అన్నారు. రైతులకు వైసీపీ ప్రభుత్వం 1600 కోట్లు ధాన్యం డబ్బులు బకాయిలు పడితే కూటమి ప్రభుత్వంలో అందజేశామన్నారు. రసాయన ఎరువులందించడం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని, రైతులపై ప్రేమ ఉంటే ప్రధాన మంత్రి మోదీని వైసీపీ నాయకులు, వాళ్ల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఎరువులు ఇవ్వమని అడగాలని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వంపై ఫేక్ ప్రచారం చేయాలని తలపెట్టిన రైతు పోరు కార్యక్రమంలో రైతులే లేరన్నారు. రైతు పోరు కార్యక్రమం అంతా బూటకమని, వందలాది మంది ధర్నాలో పాల్గొని అధికారులకు వినతిపత్రం ఇచ్చామన్న వైసీపీ నాయకుల వెంట రైతులు రాలేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కొరత లేకుండా జిల్లాల వారీగా యూరియా పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేశారని తెలిపారు. కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులను గ్రామాల్లోకి పంపించి రైతుల సమస్యను పరిష్కరిస్తున్నారని తెలిపారు.

మేకావారిపాలెం, లక్ష్మీపురంలో
యూరియా పంపిణీ

చల్లపల్లి: మేకావారిపాలెం, లక్ష్మీపురం సొసైటీల్లో బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. మేకావారిపాలెం సొసైటీకి 20 టన్నుల యూరియా రాగా సొసైటీ చైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, సీఈవో కోరుకొండ శ్రీనివాసరావు పంపిణీ చేశారు. వక్కలగడ్డ శివరామకృష్ణ, చిటికినేని శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, వేమూరి రమేష్‌బాబు, మేకా వెంకటేశ్వరరావు, వీఆర్వో ఆర్.ప్రశాంత్ పాల్గొన్నారు. లక్ష్మీపురం సొసైటీకి తొలివిడతగా 20 టన్నుల యూరియా రావటంతో రైతులు పెద్ద సంఖ్యలో సొసైటీకి చేరుకున్నారు. ఈ పోస్ యంత్రం సమస్య కారణంగా ఇప్పటివరకూ సొసైటీకి యూరియా రాలేదు. తొలిసారిగా రావటంతో విస్తీర్ణం ఆధారంగా ఎక్కువ యూరియా ఇవ్వాలని అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. సొసైటీ చైర్మన్ యార్లగడ్డ లంకబాబు జోక్యం చేసుకుని మరోసారి సొసైటీకి యూరియా వచ్చినప్పుడు పెద్దరైతులు తీసుకోవాలని, అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా పంపిణీ చేద్దామని చెప్పారు. ఎకరాకు అరబస్తా చొప్పున రెండు బస్తాల పరిమితి వరకు యూరియాను పంపిణీ చేశారు. ఏవో కె.మురళీకృష్ణ, పర్సన్లు సూదాని పూర్ణచంద్రరావు, తోట రాజేశ్వరరావు, సొసైటీ కార్యదర్శి లంకపల్లి రమేష్ బాబు, నీటిసంఘం అధ్యక్షుడు గొరిపర్తి సుబ్బారావు, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎస్సై సుబ్రహ్మణ్యం సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



మేకావారిపాలెం సొసైటీలో యూరియా పంపిణీ చేస్తున్న చైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, టీడీపీ నేతలు

● అవనిగడ్డ రూరల్: రామచంద్రపురంలో బుధవారం రైతులకు ఏవో శుభహారిక, సర్పంచ్ వాకా రమేష్ యూరియా పంపిణీ చేశారు. దక్షిణచిరువోలులంకలో ఏఈవో నాగరాజు ఆధ్వర్యంలో 225 బస్తాల యూరియాను పంపిణీ చేశారు.



అనంతపురం జిల్లా రాయవరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర పోటీలకు వెళుతున్న జిల్లా క్రీడాకారులు

బాల్ బ్యాడ్మింటన్
రాష్ట్ర పోటీలకు జిల్లా క్రీడాకారులు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాయవరంలో గురువారం నుంచి నిర్వహించే బాల్ బాడ్మింటన్ రాష్ట్ర పోటీలకు బుధవారం జిల్లా తరఫున ఆడే క్రీడాకారులు తరలి వెళ్లారు. బాలుర జట్టు నుంచి పి.కార్తీక్, ఎస్.అనిల్‌కుమార్, టి.జ్ఞానేశ్వర్, బి.సాయిశశ్వంత్, కె.శైలేంద్రకుమార్, జి.జస్వంత్‌సాయి, టి.దిలీప్, హరీష్, బాలికల జట్టు నుంచి వి.మేరీరత్నకుమారి, జి.కోటేశ్వరమ్మ, కె.ఉమామహేశ్వరి, సీహెచ్ రామచంద్రిక, బి.నీలిమాకుమారి, వి.పల్లవి, సీహెచ్ శ్రావణి, కె.పావని, పి.మేఘన, కె.నాగభవానీ జిల్లా తరఫున ఆడనున్నటు బాల్‌బాడ్మింటన్ జిల్లా కార్యదర్శి ఎం.శివశంకర్ తెలిపారు.

15న ధర్నాను జయప్రదం చేయాలి

అవనిగడ్డ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని కార్మికులకు ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యాసం శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు మాదాసు కుమార్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జరుగువానిపాలెంలో కార్యకర్త పోతురాజు కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ

జనసేన క్రియాశీల కార్యకర్తల కుటుంబాలకు
బీమా చెక్కులు అందజేత

కోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల్లో మృతి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా చెక్కులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ బుధవారం అందజేశారు. ఇటీవల మృతి చెందిన జరుగువానిపాలేనికి చెందిన చెందిన పార్టీ క్రియాశీల కార్యకర్త అప్పికట్ల పోతురాజు కుటుంబానికి, ప్రమాదవశాత్తు మరణించిన వేకనూరుకు చెందిన క్రియాశీలక సభ్యుడు వక్కపట్ల వెంకటరమణ కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులను ఆయన అందించారు. జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, యువ నాయకులు జరుగు పోతురాజు, యర్రంశెట్టి దామోదర్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం రూరల్ సబ్ డివిజన్ పరిధిలో బుధవారం విద్యుత్ శాఖాధికారులు తనిఖీలు జరిపారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, ఆపరేషన్ ఈఈ జి.గోవిందరాజుల ఆధ్వర్యంలో 34 బృందాలు పాల్గొన్నాయి. 2794 గృహ సర్వీసుల్లో 131 వాణిజ్య సర్వీసులు ఉన్నట్టు గుర్తించారు. 228 ఆక్వా సర్వీసులు తనిఖీ చేశారు. అదనపు ఓల్టేజీ వినియోగిస్తున్న 310 సర్వీసులకు రూ.10 లక్షల 57 వేల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో ఏడీఈ కె.రామకృష్ణ, రూరల్ ఏఈ పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

విడియాల చక్రవర్తికి బీవీ పట్టాభిరామ్ స్మారక పురస్కారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యల నివారణా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో నగరానికి చెందిన సైకాలజిస్టు విడియాల చక్రవర్తి డాక్టర్ బీవీ పట్టాభిరామ్ స్మారక జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, సైకాలజిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ ఖరీమ్, మ్యాజిక్ అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రమేష్ నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. పలువురు సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు విడియాల చక్రవర్తికి అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సైకాలజిస్టు విడియాల చక్రవర్తి

డిగ్రీ కళాశాలలో ఆత్మహత్యల నివారణా దినోత్సవం

అవనిగడ్డ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినోత్సవాన్ని బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన నిర్వహించారు. నేటి కాలంలో యువతే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అంచనాలు చెబుతున్నాయని, సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని ప్రిన్సిపాల్ సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వీరకుమారి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఆర్.అంకారావు పాల్గొన్నారు.

ఒక కుటుంబానికి చెందని ఓటర్లంతా
ఒకే బూత్‌లో ఉండాలి

● ఆ బాధ్యత బీఎల్వోలదే: కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పెడన, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు తొలగించాలి. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లంతా ఒకే బూత్‌లో ఉండేలా చూడాలి. అందరికీ ఒకే డోర నంబర్ ఉండాలి. ఆ బాధ్యత బీఎల్వోలదే.' అని కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తన చాంబర్‌లో బీఎల్వోలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. విచారణ చేసి, వాస్తవం అని నిర్ధారణ అయ్యాకే జాబితాలో చేర్పులు, మార్పులు చేయాలన్నారు. మేనేజర్ ఎన్.రాజా పాల్గొన్నారు.

బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన

గూడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా బుధవారం గూడూరు హైస్కూల్‌లో కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం ఎంజీ విజయకుమారి, యోహాను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషశ్రీ, కార్యకర్త రెజీనారాణి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

మోపిదేవి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవదాయశాఖ ఆర్జేసీ, సింహాచలం ఆలయ ఈవో వి.త్రినాథరావు దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకుని పూజల్లో పాల్గొన్నారు. త్రినాథరావును ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు సత్కరించి ప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని అందించారు.



ఆర్జేసీ త్రినాథరావుకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో శ్రీరామవరప్రసాదరావు

విద్యార్థులకు ప్లేట్లు, డైరీలు అందజేత

నాగాయలంక, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కమ్మనమోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.25 వేలు విలువైన భోజనం ప్లేట్లు, డైరీలు, ఐడెంటిటీ కార్డులను సోషల్ ఉపాధ్యాయుడు మేడా బాబ్జీ అందించారు. తన తల్లిదండ్రులు మేడా నారాయణరావు-మునిమ్మ జ్ఞాపకార్థం బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. బాబ్జీని ఎంఈవోలు సనకా శ్రీకాంత్, అన్నపరెడ్డి రామారావు, కాంప్లెక్స్ చైర్మన్ ఇంకొల్లు చంద్రశేఖర్ అభినందించారు. గ్రామ పెద్దలు బొడ్డు విజయ్, నక్కా విజయ్‌బాబు, ఎస్ఎంసీ చైర్మన్ కె.దుర్గాభవాని, హెచ్ఎం తుంగల విశాలి పాల్గొన్నారు.

పాముకాటుకు రైతు మృతి

కోడూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పశువుల మేత కోసం వెళ్లిన రైతును పాముకాటు వేయడంతో మృతి చెందిన ఘటన నరసింహాపురం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు చింతా వెంకట్రావు (50) పశువులకు గడ్డి తేవడానికి ఉదయం పొలం వెళ్లాడు. గడ్డి కోస్తుండగా ఎడమ చేయి బొటనవేలును పాము కరిచింది. వెంటనే ఆయనను అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయాడని వైద్యుడు నిర్ధారించారు. కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై చాణక్య తెలిపారు.

సత్వర పోస్టల్ సేవలందించడమే లక్ష్యం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్వర, పారదర్శక పోస్టల్ సేవలను జిల్లా ప్రజలకు చేరువ చేసే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కార్యాలయం వద్ద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ అందించే పోస్టల్ సేవింగ్స్, ఇన్సూరెన్సు పథకాలను ఆయన వివరించారు. జీఎస్టీ స్లాబులను ఇన్సూరెన్సులపై తగ్గించడం ద్వారా 2778 రూపాయల అతి తక్కువ ప్రీమియంతో 50 లక్షల రూపాయల లైఫ్ ఇన్సూరెన్సు(ఏడాది కాలవ్యవధి), 799 రూపాయల ప్రీమియంతో పది లక్షల రూపాయల పాలసీ(ఏడాది కాలవ్యవధి) ఇస్తున్నట్టు తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లో 8.2 వడ్డీ రేటుతో 250 నుంచి లక్ష రూపాయలు వరకు సేవింగ్స్ చేసుకోవచ్చన్నారు. పోస్టల్ సేవలను మరింత చేరువ చేసేందుకు గ్రామాల్లో క్యాంపులను ఏర్పాటు చేస్తామన్నారు. పోస్టల్ మార్కెటింగ్ మేనేజరు ఈశ్వర్ పాల్గొన్నారు.



పోస్టల్ పథకాలపై స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

హసీంబేగ్‌కు సత్కారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్‌ను బుధవారం ఆయన సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని రామకృష్ణ ఆకాంక్షించారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మైఖేల్ పాల్గొన్నారు.



హసీంబేగ్‌ను సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

నిబద్ధతతో పనిచేస్తే పదోన్నతులు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో పనిచేసేవారికి పదోన్నతులు వస్తాయని, పదోన్నతి మరింత బాధ్యతలు పెంచుతుందని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన కేపీవీ ప్రసాదరావు, కె.గణేష్, కె.వెంకటేశ్వరరావును ఎస్పీ అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135 , 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

ఘనంగా శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసి యున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ హోమంలో 92మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. హోమ పూజను ఘనంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), ధర్మకర్తల సంఘం చైర్మన్ సాయన రాజేష్, ధర్మకర్తలు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, విక్కుర్తి పోతురాజు, శారద, కనక దుర్గ భవాని, గోపాలశాస్త్రి పాల్గొన్నారు.


పూర్ణాహుతి హోమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

పామర్రు,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని తోట్లవల్లూరు,పెదపారుపూడి మండలాలకు చెందిన అనారోగ్యబాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.52,378 నగదు చెక్కులను బుధవారం బాధితులైన పాములంకకు చెందిన జెట్టి రాజేశ్వరి రూ.15వేలు, వింజరంపాడుకు చెందిన మేడేబోయిన శివశ్రీలక్ష్మికి రూ.37,378ను ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అరుణ కుమారి

చట్టాలపై అవగాహన తప్పనిసరి

పెదపారుపూడి: మహిళలు పని చేసే కార్యాలయాల్లో ఇతర సంస్థల్లో లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశం ఉందని గ్రహిస్తే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి తెలిపారు. బుధవారం ఎలమర్రు జడ్పీ హైస్కూల్‌లో కిషోర్ బాలికలకు వసరమైన చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్లు వాణి, విజయ్ కుమారి, శాంతకుమారి, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : బాలికల సంరక్షణకు ఉన్న చట్టాలపై తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో చట్టం, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, రక్తహీనతను నివారించటం తదతర అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలు విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

ఆలయ గోపుర ప్రతిష్ఠ అక్టోబరు 30 నుంచి

గుడ్లవల్లేరు : సత్యదేవుని ఆలయ గోపుర ప్రతిష్ఠ మహోత్సవాలు అక్టోబరు 30,31 నవంబరు 1వ తేదీల్లో దాదాపు ఖరారైయిందని ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకట్రావు, కొనరాజు బాపయ్యచౌదరి తెలిపారు. బుధవారం గ్రామస్థులు సత్యదేవుని ఆలయంలో సమావేశమయ్యారు. రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, రవి శంకర్, కంతేటి వెంకట సుబ్బారావు, వెంకటసుబ్బారావు చౌదరి, నాగరాజు, రామకృష్ణ, పాల్గొన్నారు.

యూరియా కొరతపై ఆందోళన చెందొద్దు

● కలెక్టర్ డీకే బాలాజీ


పెదమద్దాలిలో యూరియా సరఫరా పట్ల రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బాలాజీ

పామర్రు,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరం మేరకు సమృద్ధిగా యూరియాను నిరంతరం అందించే విధంగా చర్యలు తీసుకోనున్నామని, గ్రామాల్లో రైతులు ఆందోళనకు చెందవద్దని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామ సొసైటీలో యూరియా పంపిణీపై రైతుల ఇబ్బందులను తెలుసుకునేందుకు క్షేత్ర స్థాయి పర్యటనద్వారా రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. యూరియా సరఫరాలో ఎలాంటి అపోహలు, భయాందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.రవికాంత్, ఏవో శివనాగరాణి, గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కూచిపూడి :యూరియా కోసం రైతులు చెప్పులు లైన్‌లో ఉంచి చెట్ల నీడన కాపలాకాస్తున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. బుధవారం ఒక్క రోజే మొవ్వలో 110 టన్నులు యూరియా పంపిణీ జరిగింది. ఆయా గ్రామాల్లో యూరియా పంపిణీ చేస్తారని రైతులకు తెలియటంతో మొవ్వ పాలెం పీఏసీఎస్ వద్ద రైతులు ఉదయం 6.30 గంటల నుంచే చెప్పులు లైన్‌లో పెట్టి పడిగాపులు పడ్డారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసు బందోబస్తు నడుమ కేంద్రాల వద్ద యూరియా పంపిణీ చేపట్టారు. మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ శ్యామల, ఏవో సురేష్‌బాబు నాయక్‌ల పర్యవేక్షణలో యూరియా పంపిణీ జరిగింది. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ సరిపడినంత యూరియా నిల్వలు ఉన్నాయని, ఈ కేంద్రంలో అయిపోతే పక్క కేంద్రంలోనూ యూరియా తెచ్చుకునే వెసులుబాటు ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

నందివాడ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా తీసుకుని రైతులకు పంపిణీ చేస్తుందని, పెదలింగాల, తమిరిశ గ్రామాల్లో బుధవారం యూరియా పంపిణీ చేసినట్లు ఏవో భాను ప్రకాష్ తెలిపారు. ప్రశాంతంగా యూరియా పంపిణీ జరుగుతుందని తెలిపారు. రైతు ధర్మారావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ ఈ విధంగా గ్రామాల్లో సొసైటీల ద్వారా రైతులకు యూరియా అందించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదలింగాల, తమిరిశ రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు


తమిరిశ సొసైటీలో టోకెన్లు తీసుకుంటున్న రైతులు

పెదపారుపూడి : రైతులకు యూరియా అందుబాటులోకి వస్తుందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ విజయవాడ డీఎస్పీ బంగారు రాజు తెలిపారు. బుధవారం యూరియా పంపిణీని పరిశీలించి రైతులతో మాట్లాడారు. వెంట్రప్రగడ, వానపాముల, పెదపారుపూడి పీఏసీఎస్‌లను సందర్శించి రైతులకు ఉన్న అపోహలు తొలగించారు. యూరియా కొరత లేకుండా సక్రమంగా సరఫరా జరిగే విధానం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆంజనేయులు, సీఈవో నాగరాజు, వెంట్రప్రగడ పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, పాల్గొన్నారు.


బాధితుడికి నగదును అందజేస్తున్న గోపాలకృష్ణ, శివరామ్

ఆర్థిక సాయం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన పీ4 పథకం పిలుపుకి స్పందించి రొయ్యూరులో టీడీపీ నేత ఉప్పులూరి గోపాలకృష్ణ బుధవారం తెల్లాకుల మోహన్ ఆకాష్ అనే వ్యక్తికి ఆపరేషన్ నిమిత్తం రూ.35 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. రొయ్యూరు గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ చేతుల మీదుగా గోపాలకృష్ణ నగదు సహాయాన్ని ఆకాష్‌కి అందజేశారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పీ4 పథకం కింద సహాయం చేయాలని తమకు సూచించారని గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లుక్కా రేణుకారావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం



గుడ్లవల్లేరు : నేత్రదానంతో మరొకరికి చూపు ప్రసాదించ వచ్చన్న సంకల్పంతో గుడ్లవల్లేరుకు చెందిన మూల్పూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆయన మరణానంతరం బుధవారం వారి నేత్రాలను దానం చేశారు. నాగేశ్వరరావు మంగళవారం రాత్రి మృతిచెందారు. కాగా కుటుంబ సభ్యుల అంగీకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో పెదకాకాని శంకర్ నేత్రాలయా వైద్య బృందంచే ఆయన కార్నియా సేకరించారు. లయన్స్ ప్రతినిధులు, వైద్యబృందం నాగేశ్వరరావు భౌతికఖాయానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మూల్పూరి సుధాకర్, అడుసుమిల్లి వీరబద్రరావు, పెరుమాళ్ళ రావు, వైపీసీ ప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభివృద్ధిలో భాగస్వామ్యం తప్పనిసరి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన అట్టడుగు కుటుంబాల అభివృద్ధికి తోడ్పడేందుకు రూపకల్పన చేసిన పీ4లో ప్రవాసాంధ్రులు భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. దుబాయ్ పర్యటనలో భాగంగా వివిధ రంగాల్లో స్థిరపడిన జిల్లా, గుడివాడకు చెందిన వారితో కరామ నగరంలో బుధవారం ప్రవాసాంధ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా బలంగా ఉన్న ప్రవాసాంధ్రులు మూలాలను మరచిపోకుండా తమ ప్రాంతాల అభివృద్ధిలో, పేదవర్గాల అభ్యున్నతిలో భాగస్వామ్యులు కావాలన్నారు. పీ4 ద్వారా నిర్వహించే కార్యక్రమాలను ప్రవాసాంధ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు డాక్టర్ గుత్తా రవి, తుంగా ప్రసాద్, పునుకోలు సతీష్, సాహల్ పణి సూర్యదేవర, ఎన్ఆర్ఐ టీడీపీ యుఏఈ అధ్యక్షుడు మోతుకూరి విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వాసు పోడిపిరెడ్డి, మురారి, ముక్కు తులసీ, కేసరి త్రిమూర్తులు, గల్ఫ్ జనసేన సభ్యులు, ఎన్ఆర్ఐ టీడీపీ యూఏఈ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెనిగండ్లను సత్కరిస్తున్న ప్రవాసాంధ్రులు

విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలి

● జి.ఆర్ కమలామృతం

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ ఫోన్ల అతివీక్షణం, వినియోగం వల్ల వ్యక్తిగత సంబంధాలు క్షీణిస్తున్నాని గుడివాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గవర్నమెంట్ ప్లీడర్ జి.ఆర్ కమలామృతం అన్నారు. బుధవారం స్థానిక వీవీఐపీఎస్ ఫార్మాస్యూటికల్ కళాశాలలో వీవీఐపీఎస్ ,ఐపీఏ గుడ్లవల్లేరు లోకల్ బ్రాంచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మహత్యా నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమలామృతం ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. స్నేహితులతో మనస్ఫూర్తిగా మాట్లాడలేని పరిస్థితుల వల్ల ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పరిస్థితులు దారితీస్తున్నాయన్నారు. సోషల్ మీడియా ప్రలోభాలకు లొంగకుండా మన చుట్టూ ఉన్న వ్యక్తులను, పరిస్థితులను అవగాహన చేసుకొంటూ తల్లి తండ్రులతో అన్ని విషయాలనూ పంచుకొంటూ జీవితాన్ని విజయపథంలో ఉంచుకోవాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా కమలామృతంను ప్రిన్సిపాల్ఎ.లక్ష్మణరావు, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.సాయిధాత్రిలు సన్మానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి కమలామృతం

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

● ఎంపీడీవో జ్యోతి

పామర్రు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర, సమ్మిళితతోపాటు స్థిరమైన అభివృద్ధి,గ్రామ పంచాయతీ స్థాయిలో డేటా ఆధారిత పర్యవేక్షణ ప్రణాళిక కోసం సామర్థ్యాలు పెంచడమే పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ వెర్షన్ 2.0లక్ష్యమని ఎంపీడీవో కాండ్రు జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచ్‌లతోపాటు ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్(పీఏఐ) వెర్షన్2.0పై అవగాహన సదస్సు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించబడిన తొమ్మిది ఇతి వృత్తాలపై గ్రామ పంచాయతీల పురోగతిని అంచనా వేయడానికి, పర్యవేక్షించడానికి పీఏఐ ఒకబలమైన సాధనంగా దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య, నీటి సమృద్ధి, పరిశుభ్రమైన పర్యావరణం, మౌలిక సదుపాయాలు, పాలన, సామాజిక న్యాయం, మహిళసాధికారత వంటి రంగాలను అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం పీఏఐ వెర్షన్ 2.0ను ఎలా ఉపయోగించుకోవాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈసమావేశంలో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, పామర్రు సర్పంచ్ కేకస్తూరి, పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలి

● ఐసీడీఎస్ డైరెక్టర్ ఎన్.ఉమారాణి

పామర్రు,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల్లో రక్తహీనత నివారణకు అంగన్వాడీ సిబ్బంది సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతూ రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.ఉమారాణి అన్నారు. కురుమద్దాలి స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రంలో బుధవారం అంగన్వాడీల చిన్నారుల తల్లులకు, మహిళలకు వృత్తి నైపుణ్యత అభివృద్ధి అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తహీనత నివారణకు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రసవానంతరం ఆరు నెలల వరకు తమ బిడ్డలకు తల్లి పాలుమాత్రమే తాగించాలన్నారు. అదే విధంగా మహిళా సాధికారత కోసం గ్రామాల్లో అమలు చేస్తున్న వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచుకోవాని కోరారు. పామర్రు సీడీపీవో చౌదరి సన్యాసమ్మ(కల్యాణి) వ్యక్తిగత పరిశుభ్రత,పోషక ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పథకాలను అర్హతగల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కురుమద్దాలి మహిళ సంరక్షణ కార్యదర్శి కె.ఉదయలక్ష్మీ, సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్వాడి కేంద్రం నిర్వహకులు కె.విజయలక్ష్మి, డి.భవాని ఏఎన్ఎం శ్రీదేవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఉమారాణి

రసాయనిక ఎరువులు ఉపయోగించొద్దు

● ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులు ఉపయోగించవద్దని ఏవో బోలెం అనంతలక్ష్మి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చిరుచింతల పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని, రామన్నపూడిలో యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా నత్రజని ఎరువులు ఎక్కువగా వేయటం వల్ల తెగుళ్ల వచ్చి వరి పైరు పాడవుతుందన్నారు. వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించి సముపాళ్లలో ఎరువులు వేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతూ ఎక్కువ మోతాదులో యూరియా వేస్తున్నారని, భూమి గుల్ల బారుతుందని తెలిపారు. కలుపు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కలుపు నివారించటం వల్ల చీడపీడలు దరి చేరవన్నారు. దుబ్బులు ఎక్కువగా పెరిగినందున నీరు తక్కువగా ఉన్నప్పుడు ఎలుకల బెడద ఎక్కువ ఉంటుందని, వాటి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్ఎస్‌కే, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


చిరుచింతలలో రైతులతో మాట్లాడుతున్న ఏవో అనంతలక్ష్మి

ఐలమ్మ పోరాటాల ఫలితమే భూసంస్కరణలు

గుడివాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : భూ వ్యవస్థలకు వ్యతిరేకంగా ఉమ్మడి రాష్ట్రంలో ఐలమ్మ చేసిన పోరాటాల ఫలితంగా అనేక భూసంస్కరణలు, పేదవర్గాలకు భూ పంపిణీ జరిగిందని టీడీపీ నాయకులు జగన్మోహనరావు, రజక అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కోడూరు ప్రభులు పేర్కొన్నారు. పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక నీలామహల్ రోడ్డులోని రజక అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెత్తందారీ, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, ఎస్సీ, ఎస్టీ జిల్లా కమిటీ సభ్యులు రామదేను వేణు బాబు, పాల్గొన్నారు.


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ముగ్గురు నిందితుల అరెస్టు

గుడివాడ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నగర్ కాలనీలో గత ఫిబ్రవరి 13వ తేదీ కాశీ రామకృష్ణ విశ్వనాథ్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా, గుర్తు తెలియని దొంగలు వారి ఇంటి తాళం పగలకొట్టి ఇంటిలోని శ్యాంసంగ్ టీ వి, వెండి చెంబు, హోమ్ థియేటర్ స్పీకర్స్ మొదలగు సుమారు రూ.25 వేల విలువైన వస్తువులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుడివాడ రూరల్ ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కేసు దర్యాప్తు చేసి వేలిముద్రలు ఆధారంగా నలుగురు నిందితులను గుర్తించారు. సదరు నిందితుల్లో చల్లా శ్యామ్, పల్లపు సాయి సుభాష్, తిరుమలశెట్టి ధనుష్‌లను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 15 రోజులు రిమాండ్ విధించారు. మచిలీపట్నం జిల్లా జైలుకి వారిని తరలించినట్లు ఎస్సై తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు

పమిడిముక్కల : గురజాడలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై చనిపోయిన చెందిన రాజులపాటి గురవయ్యకు చెందిన పాడిగేదెకు నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఎండీ ని ఇందనశాఖ జాయింట్ సెక్రటరీ కేవీ కిషోర్‌కుమార్ ఆదేశించినట్లు గ్రామ మాజీసర్పంచ్, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. గురవయ్యకు చెందిన రూ. 2లక్షలు విలువచేసే పాడిగేదె విద్యుదాఘాతానికి గురై చనిపోగా పరిహార చెల్లించి ఆదుకోవాలని ఇందన శాఖ ముఖ్య కార్యదర్శికి చేసిన ఫిర్యాదు మేర పరిహారం చెల్లింపునకు చర్యలు తసుకున్నట్లు శ్రీనివాసగౌడ్ తెలిపారు.

రూ.లక్ష చోరీ

గుడివాడ : స్థానిక జీవీఆర్ స్ట్రీట్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు పూల అరుణకుమారి బుధవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో రూ.2లక్షల నగదు విత్‌డ్రా చేసి తన బ్యాగులో పెట్టుకుంది. ఆటోలో మార్కెట్ సెంటర్‌లోని శ్రీజ వెడ్డింగ్ మాల్ వద్ద ఆటో దిగి పక్కనే ఉన్న బంగారం దుకాణానికి వెళ్లి, తన బ్యాగులో నగదు చూసుకుంటే రూ.1లక్ష మాయమైనట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో జిల్లా లయన్స్ అంధత్వ నివారణ, నేత్ర పరిరక్షణ చైర్‌పర్సన్ యర్రంశెట్టి శ్రీనివాసరావు వితరణతో హైస్కూల్ విద్యార్థుల నేత్ర వైద్య పరీక్షలు బుధవారం నిర్వహించారు. వడ్లమన్నాడు శిబిరాన్ని జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, కౌతవరం హైస్కూల్‌లో శిబిరాన్ని జిల్లా పాలుత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ వి.బి.కే.వి సుబ్బారావు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

గుడివాడ : ఓర్వలేనితనంతోనే యూరియాపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని కూటమి నాయకులు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు సొసైటీల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలు, గ్రోమోర్ కేంద్రాల ద్వారా పారదర్శకంగా యూరియా బస్తాలను అందిస్తుందన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డు చైర్మన్లు రవి కుమార్, రవికుమార్‌లు, టీడీపీ నేత రాంబాబు, పాల్గొన్నారు.